VISALAANDHRA, VIJAYAWADA -4· Phone 376 * * * Regd No H 203

విశాలాంధ్ర
చందా వివరాలు

	ఏజెంటు ద్వారా	పోస్టు ద్వారా
సంవత్సరం	రు 31 00	రు 34 00
ఆరు మాసాలు	15 50	17 00
మూడు మాసాలు	7 75	8 50
ఒక మాసం	2 65	2 90

విశాలాంధ్ర

File Copy
Dept of Info & Public Relations, Hyd

70182

క్లచ్ స్ప్రింగర్లు
క్లచ్ డిస్కులు
ఆధునిక యంత్రములపై
రికండిషన్ చేయుచున్నాము
వివరములకు:
సరస్వతీ ఇన్‌డస్ట్రీస్,
ఆటోమొబైల్స్ క్లచ్ రీబిల్డర్సు గోపాలరెడ్డిరోడ్ విజయవాడ 2

సంపుటి 14 సంచిక 295] విజయవాడ • 11-1-1965 సోమవారం [4 పేజీలు 8 పై.

సైగాన్ శివార్లలో దక్షిణవియత్నాం పటాలంపై గెరిల్లాల దాడి

ఇటీవలజరిపిన అమెరికా విమానాలవేట నిష్ప్రయోజనమయిందని సైనికపరిశీలకుల వ్యాఖ్య

రాజధానికి ఇంత దగ్గరగా దాడి జరగటంతో ప్రభుత్వ వర్గాల కంగారు

సైగాన్ జనవరి 9

సైగాన్‌కు 15 కిలోమీటర్ల సమీపంలో గల దక్షిణ వియత్నాం సైనిక పటాలంమీద వియత్‌కాంగ్ గెరిల్లాలు నేడు దాడిచేసి ఒక అమెరికన్ అధికారిని 5 గురు వియత్నాం సైనికుల్ని వధించారని అమెరికన్ వర్గాల వారన్నారు సైగాన్ పరిసర ప్రాంతాల్లో గెరిల్లాలు పెద్దయెత్తున దాడులు జరుపుతూ ప్రభుత్వసైన్యాలకు తీవ్రనష్టాలను కల్గించటంపట్ల అమెరికావర్గాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి

ఒక అమెరికా పౌరుడు 14 గురు సైనికులుకూడా ఈ దాడిలో గాయపడారు

ఒక రేడియో ట్రాన్స్మిటర్‌ను అనేక మోర్టార్లను, మరతుపాకుల్ని గెరిల్లాలు వశపర్చుకున్నారు.

గెరిల్లాల దాడికి వికావికలయి పారిపోయిన ప్రభుత్వ సైనికులు తమదగర వున్న వస్నీ అక్కడే వదిలి పోయారు

రాజధానికి ఇంతదగరగా వచ్చి గెరిల్లలు దాడిచేయటం ఇదే ప్రథమం అని వియత్నాం సైనిక వర్గాల వారంటున్నారు

సైగాన్ పరిసర ప్రాంతంలో గెరిల్లాలు కేంద్రీకరించి తీవ్రమైన దాడులు జరుపుతున్నట్లు, అమెరికా సైనికాధికారులు వెల్లడిస్తున్నారు.

సైగానుకు ఉత్తరదిశగావున్న తుండామాట్ వదగల ప్రభుత్వ సైనికస్థావరంపై దాడిచేసి 13 గురు ప్రభుత్వ సైనికులను చంపివేసి ఇద్దరిని గాయపరచి 25 ఆయుధాలను స్వాధీనం చేసుకొన్నట్లు మరో వార్త తెల్పుతున్నది

బిన్‌గియాకు వాయువ్య దిశలో ఉన్న మరో సైనిక స్థావరంపై కూడా విప్లవకారులు దాడిచేసి తీవ్ర నష్టాలను కల్గించినట్లు అమెరికన్ వర్గాలు ప్రకటించాయి.

సైగాన్‌కు నైరుతి దిశగా 25 30 కిలోమీటర్ల దూరంలో రెండు వంతెనలను గెరిల్లాలు కూల్చి వేశారు

గెరిలాలు పెద్ద ఎత్తున దాడులు జరుపుతూ తీవ్ర నష్టాలను కల్గించటం పట్ల అమెరికన్ వర్గాలు తీవ్రంగా ఆందోళన చెందుతున్నాయని అయితే దక్షిణ వియత్నామ్ ప్రభుత్వం ఈ దాడుల విషయమై ఎట్టి అధికార ప్రకటన చేయలేదని రాయిటర్ విలేకరి తెల్పుతున్నాడు

బిన్‌గియా ప్రాంతంలో గెరిల్లాలు దాడి సల్పుతుండగా వారిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వ సైనికులతోపాటు పనిచేస్తున్న అమెరికా అధికారి నౌకరిని మరో నాన్ కమీషన్డు ఆఫీసరును గెరిల్లాలు చంపివేసినట్లు అమెరికా అధికారులు ప్రకటించారు. మధ్య వియత్నామ్ తీరప్రాంతంలో క్వాంగయావద్ద ప్రభుత్వ సైనికులతోపాటు గస్తీచేస్తున్న ఒక అమెరికా సైనికుడు నిన్న గెరిల్లాల చేతుల్లో గాయపడ్డాడు

మధ్య వియత్నాంలోని మికాంగ్ డెల్టాపై గెరిల్లాలు గురువారం, శుక్రవారం రెండు రోజులు దాడి చేసి 8 మందిని చంపి 6 గురిని గాయ పరిచారు

బోర్నియో ప్రాంతంలో అదనంగా బ్రిటిష్ సేనల మోహరింపు

కౌలాలంపూర్ జనవరి 9

మలేషియాకు చెందిన బోర్నియో దీవిప్రాంతానికి బ్రిటన్ మలేషియాలు మరో పదాతి దళాన్ని పంపుతున్నట్లు మలేషియా రక్షణమంత్రి నేడిక్కడ ప్రకటించారు

ఈ ప్రాంతంలో ఇప్పటికే మూడు సైనిక పటాలాలు ఉన్నాయి

వీటిలో బ్రిటన్‌కు చెందిన స్కాట్స్‌గార్డ్స్ పటాలం, గూర్ఖా రైఫిల్ దళాలు ఉన్నాయి

ఇది ఇలా వుండగా బ్రిటిష్ సైనికమంత్రి దూరప్రాచ్య సైనిక పరిస్థితిపై 4 గంటల పాటు సింగపూర్‌లో బ్రిటిష్ సైనికాధికారులతో చర్చలు జరిపారు

బ్రిటిష్ సైనికమంత్రి ప్రిడ్‌ముల్లే ఈ ప్రాంతంలో బ్రిటిష్ స్థావరాలను సందర్శిస్తున్నారు ఈయన రేపు సోమవారం మలేషియాకు బయలుదేరి వెళతారు

బ్రిటన్ ఈ ప్రాంతంలో ఉన్న తన 50 వేలమంది సైనిక బలగానికి అదనంగా సైనిక బలగాలను జోడిస్తున్నది. వేయిమంది పారాట్రూప్ సైనికులను రెండువందలమంది నౌకాదళాన్ని 6 యుద్ధనావలను కొత్తగా తన సైనిక బలగానికి తూర్పుచున్నది.

మలేషియా - ఇండొనేషియాల మధ్య 1962 లో అప్రకటిత యుద్ధం ప్రారంభమైన తరువాత ఇప్పటికి ఉభయ పక్షాలకు చెందిన సైనికులు దాదాపు వేయిమంది మరణించి వుంటారని భావిస్తున్నారు

ఇండొనేషియా చర్యకు సోవియట్ సమర్థన

జాతీయ ప్రయోజనాలకై సాగిస్తున్న పోరాటాన్ని బలపరుస్తూ 'ఇజ్వెస్తియా' ప్రకటన

మాస్కో జనవరి 9

మలేషియా, ఇండొనేషియా వివాదం ప్రస్తుత దశలో ఇండొనేషియా తీసుకున్న చర్యను సోవియట్ ప్రజానీకం ఎట్టి మినహాయింపులు లేకుండా పూర్తిగా బలపరుస్తున్నారని సోవియట్ ప్రభుత్వ పత్రిక ఇజ్వెస్తియా నేడు తెలిపింది

ఆ పత్రిక ఇంకా ఇలా రాసింది:

'ఇండొనేషియా తన జాతీయ ప్రయోజనాలకోసం సాగిస్తున్న పోరాటంపట్ల శాంతికాముక ప్రజానీకం, ప్రత్యేకించి సోవియట్ ప్రజానీకం సానుభూతిపై జరి కలిగి వుంది.

ఈ ఆసియా మహారాజ్యం ఇండొనేషియాకు వ్యతిరేకంగా కుట్రచేస్తున్నవారిని ఎదుర్కొనడంలో ఆ దేశ పట్టుదలను సోవియట్ ప్రజానీకం సమర్థిస్తారు

మలేషియాకు బ్రిటిష్ సైనికదళాలను పంపడాన్ని ఖండిస్తూ ఈ చర్య యుద్ధం ప్రారంభించడానికి సన్నాహమని విమర్శించింది

ఇండొనేషియా భూభాగంపై ఈ సైనిక బలగాల మోహరింపు కవ్వింపు చర్యగా ఇండొనేషియా ప్రభుత్వం పరిగణిస్తున్నది. ఈసైనిక బలగాల మోహరింపుకు బాధ్యతంతాసామ్రాజ్యవాదానిది. అన్నిటినీ మించి బ్రిటిష్ సామ్రాజ్యవాదానిదని ఇండొనేషియా ప్రభుత్వం పరిగణిస్తున్నదని ఇజ్వెస్తియా పేర్కొన్నది

ఇండొనేషియా నిర్ణయం రాతమూలకంగా అందలేదు

యూథాంట్ ప్రకటన

న్యూయార్క్ జనవరి 9

ఐరాస నుండి నిష్క్రమించాలని ఇండొనేషియా చేసుకున్న నిర్ణయం తనకింకా రాతమూలకంగా అందనప్పటికి ఒక దేశం పిలిచినప్పుడు దానిని అనుసరించినా దానిని గౌరవింతవలసి వుంటుందని తాను భావిస్తున్నానని ఐ. రాస ప్రధాన కార్యదర్శి యూథాంట్ ఇక్కడ చెప్పారు.

ఇప్పు నుండి కోలుకొన్నపిదప యూథాంట్ ఇక్కడకు వచ్చారు ఆయన విమానాశ్రయంలో పత్రికా విలేకరులతో సంభాషిస్తూ పై విధంగా చెప్పారు.

ఇండొనేషియా నిర్ణయాన్ని పునఃపరిలించుకోవలసినదిగా మీరు కోరతారా? అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ ఉపసంహరణ గురించి తనకింకా రాతమూలకంగా సమాచారం అందలేదని ఆయన అన్నారు

ఇండొనేషియా ప్రకటన బెదిరింపు ప్రయత్నమా అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ తాను ఈ విషయంపై ఎట్టివ్యాఖ్యా చేయజాలనన్నారు. ప్రధాన కార్యాలయంతో ప్రతినిత్యమూ తనకు సంబంధాలు వున్నప్పటికీ గత 8 రోజులుగా ఈ వ్యవహారాలకు దూరంగా ఉన్నానని అన్నారు.

ఈ పరిస్థితిని గురించి, నిబంధనావళి అంశాలు జటిలమైనవేనని తాను తన సలహాదార్లతో వాటిగురించి పరిశీలిస్తున్నానని అన్నారు.

మరో ప్రశ్నకు జవాబిస్తూ ఐరాస నుండి ఉపసంహరించుకొన్న దేశం తిరిగి సంస్థలో చేరాలని కోరడానికి ఐరాస నిబంధనావళిలో అవకాశంలేదని అన్నారు

యూథాంట్ విమానాశ్రయం నుండి సరాసరి తన ఇంటికి వెళ్ళిపోయారు

ఉపసంహరణపై సోకర్నో వివరణ

టోకియో జనవరి 9

ఐరాస నుండి ఇండొనేషియా ఉపసంహరణకు ప్రధాన కారణం మలేషియా సభ్యత్వమని సోకర్నో తన కిచ్చిన ఇంటర్వ్యూలో స్పష్టంచేశారని జపాన్ పత్రిక మైనిచి విలేకరి నేడు రాశారు

ఇండొనేషియాలోని తమ విలేకరి పంపిన వార్తను ఈ పత్రిక నేడు ప్రముఖంగా ప్రచురించింది.

తమ దేశ అంతరంగిక రాజకీయ పరిస్థితికి

(మిగతా 3 వ పేజీలో)

రాజకీయనాయకుల సైనికాధికారుల మధ్య ఒప్పందం

దక్షిణ వియత్నామ్‌లో మూడు వారాలుగా తీవ్రమైన రాజకీయ సంక్షోభం సాగుతున్న కారణంగా నేడు రాజకీయ నాయకులు, సైనికాధికారులు 6 అంశాలతో కూడిన ఒక ఒప్పందంపై సంతకాలు చేశారు

ఈ ఒప్పందం ప్రకారంతిరిగి నూతన జాతీయసమితి ఏర్పడేంత వరకు పౌరప్రభుత్వానికి పూర్తి అధికారాలు ఇవ్వబడతాయి ఈ అధికారాలు ఫాన్‌ఖాక్ సూకు ధారా దత్తం చేయబడతాయి ఈ ఒప్పంద పత్రంపై చీఫ్ జనరల్ నగూయిన్ ఖన్నా ప్రధాని త్రాన్‌వానీహ్యూంగ్ రాజ్యాధినేత ఫాన్‌ఖాక్‌సూ, సంతకాలు చేశారు.

ఈ పరిష్కారంపట్ల కొంతమంది సైనికాధికారులు అసంతృప్తి వెల్లడిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి

పౌర ప్రభుత్వంపై పర్యవేక్షణాధికారాన్ని సైన్యాధిపతికి ఉండాలని జనరల్ ఖన్నా గతంలో డిమాండ్‌చేసిన దానికే స్వల్పసవ ర్యాకులు కొందరు కట్టుబడివున్నట్లు తెలుస్తున్నది

ఈ ఒప్పంద పత్రంలో పేర్కొనబడిన అంశాలలో అరెస్టు కావింపబడిన జాతీయ సభ్యులందరినీ విడుదలచేయటం క్రొత్తజాతీయ సమితికి ఎన్నికలు జరపటం ఫ్యాన్‌ఖాక్ సూకు సర్వాధికారాలు క్రొత్తజాతీయ సమితి ఏర్పడే వరకు వప్పగించటం ఉన్నాయి ఈ ఒప్పందం పట్ల హర్షామోదాలను అమెరికావర్గాలు ప్రకటిస్తున్నాయి ఇదేసమయంలో సైగాన్‌పరిసర ప్రాంతంలో గెరిలాలు దాడిచేసి ప్రభుత్వ సైన్యాలకు తీవ్రనష్టాలను కలిగిస్తున్నాయి

కేరళ ప్రభుత్వ ఉద్యోగులకు తాత్కాలిక భృతి

పరిశీలనకు టి టి కె సమ్మతి

తిరువనంతపురం జనవరి 9

కేరళ ప్రభుత్వ ఉద్యోగులకు కొంత తాత్కాలిక భృతిని ఇచ్చే విషయం ఆలోచించుటకు కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీ టి టి కృష్ణమాచారి అంగీకరించినట్లు ఇక్కడ విశ్వసనీయవర్గాలద్వారా తెలుస్తున్నది

ఈ విషయమై సంప్రతింపులు జరపటానికి కేరళ గవర్నరు శ్రీ వి వి. గిరి జనవరి 16 న ఢిల్లీకి వెళతారు వీరితో ప్రధాన కార్యదర్శి శ్రీ ఎస్ ఎమ్ పట్నాయక్ కూడా వెళతున్నారు

రాష్ట్రంలోని ఎన్ జి వోలు, ఉపాధ్యాయులు తదితర ప్రభుత్వోద్యోగులు వేతన సంఘాన్ని వేయాలని, నెలకు 25 రూపాయలు తాత్కాలిక భృతిని ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు; వీరు మొత్తం సుమారు లక్షయాభై వేలమంది వుంటారు

వీరికి రాష్ట్రప్రభుత్వం ఆర్థిక సహాయంగా తాత్కాలిక భృతిని ఇచ్చే పరిస్థితిలో లేదని అందుకు కేంద్రప్రభుత్వం గ్రాంటుగాగాని అప్పుగాగాని సహాయం చేయవలసి వుంటుందని వీరు తెలిపారు.

కేరళ గవర్నర్ సలహాదారుడు శ్రీ గోవిందనారాయన్ ప్రస్తుతం ఢిల్లీలో ఈ విషయమై కేంద్ర ప్రభుత్వ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు

కేరళ వామపక్ష ఐక్య సంఘటన కమిటీ సమావేశం

13న జరుగుతుందని ప్రకటన

ఎర్నాకుళం జనవరి 9

నిన్న ఏర్పడిన కేరళ వామపక్ష ఐక్య సంఘటన తాత్కాలిక కమిటీ సమావేశం జనవరి 13 వ తేదీన తిరువనంతపురంలో జరుగుతుందని ఆసమావేశంలో వివిధపార్టీలకు సీట్ల కేటాయింపు విషయాన్ని చర్చిస్తామని కమిటీ ప్రతినిధి ఒకరు నేడిక్కడ పత్రికలవారికి తెలిపారు

ఈవిషయమై వివిధ పార్టీలమధ్య లాంఛనప్రాయంగా సంప్రతింపులు నేడు జరిగాయని ఆయన అన్నారు

ఉత్తరప్రదేశ్ మంత్రివర్గం రద్దుకు ప్రతిపక్షాల డిమాండ్

ప్రస్తుత ప్రజావ్యతిరేక ప్రభుత్వమే అధికారంలోవుంటే రాష్ట్రశాసనసభ సమావేశానికి హాజరుకాలేమని గవర్నరుకులేఖ

లక్నో జనవరి 9

సుచేత కృపలానీ మంత్రివర్గాన్ని వెన్వెంటనే రద్దుచేయాలని డిమాండ్‌చేస్తూ ఉత్తరప్రదేశ్ శాసనసభ కమ్యూనిస్టుపార్టీ యస్ యస్ పి, రిపబ్లికన్‌పార్టీ ఇండిపెండెంట్ గ్రూపు నాయకులు నేడు రాష్ట్రగవర్నరుకు ఒక లేఖ వ్రాశారు

ప్రస్తుత ప్రజా వ్యతిరేక ప్రభుత్వమేగనుక అధికారంలో వుంటే తాము ఫిబ్రవరి 8 వ తేదీన జరిగే శాసన సభ సంయుక్త సమావేశానికి హాజరు కాలేమని తెలిపారు

ఈ లేఖపై కమ్యూనిస్టుపక్ష నాయకుడు డాక్టర్ జడ్ ఎ అహ్మద్, యస్ యస్ పి. గ్రూపు నాయకుడు శ్రీ రామసుందర్ పాండే రిపబ్లికన్ పార్టీ నాయకుడు శ్రీ బాదీలాల్‌సాధీ ఇండిపెండెంటుగ్రూపునాయకుడు నాయక్ రామ్ శర్మ వున్నారు

"సుమారు సంవత్సరం కాలంగా రాష్ట్ర ప్రభుత్వం ఆహారపరిస్థితిని అధ్వాన్నం చేసింది ఇంకా చేస్తున్నది. ఫలితంగా ప్రజల జీవన పరిస్థితులురోజురోజుకు అధ్వాన్నమౌతున్నాయి [illegible] రాష్ట్ర ఆహార పరిస్థితి మెరుగయ్యే సూచనలు ఎక్కడా లేవు అని ప్రతిపక్షాల నాయకులు ఆ లేఖలో పేర్కొన్నారు.

శీతాకాల సమావేశాన్ని జరపవలసిందని ప్రతిపక్షాలు పదేపదే అభ్యర్థించినా మంత్రివర్గం అందుకు అంగీకరించకుండా ప్రజాస్వామ్యం కుత్తుక నులిమివేయడానికి వెనకాడలేదు అని ఆ లేఖలో విమర్శించారు.

"సోషలిస్టు ఫోరం" సభకు శ్రీ అతుల్యా ఘోష్ ప్రాతికూల్యం

దుర్గాపూర్ జనవరి 9

కేంద్ర హోంమంత్రి నందా నాయకత్వాన గల సోషలిస్టు ఫోరం సభ దుర్గాపూర్ కాంగ్రెసు మహాసభ ఆవరణలో జరగడానికి వీల్లేదని శ్రీ అతుల్యఘోష్‌వర్గం అభ్యంతరం తెల్పడంతో, సమావేశాన్ని రద్దుచేసుకోవలసి వచ్చింది

సోషలిస్టు ఫోరం సమావేశాన్ని దుర్గాపూర్ కాంగ్రెస్ మహాసభ సందర్భంలో జరుపవచ్చునని కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ కామరాజ్ ఆమోదించినప్పటికి కాంగ్రెసు మహాసభ ఆవరణలో ఆ సమావేశం జరుపుకోవడానికి ఖాళీలేదన్న మిషతో శ్రీ అతుల్యఘోష్ దానిని ఎగరగొట్టారు

"ఇప్పుడు కాదు"

విలేకరుల ప్రశ్నకు శాస్త్రి సమాధానం

దుర్గాపూర్ జనవరి 9

జూన్‌నెల మధ్య భాగంలో కామన్వెల్తు ప్రధానులసభ ఏర్పాటు చేయాలని బ్రిటిష ప్రధాని విల్సన్‌చేసిన సూచనపై మీరుపోతారా? అని విలేకరులు నేడిక్కడ ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రిని ప్రశ్నించగా, ఇప్పుడు కాదు' అనిచెప్పి తప్పించుకొన్నారు

బ్రిటిష ప్రధాని విల్సన్ రాసినలేఖకు ప్రధానిశాస్త్రి ఢిల్లీకిచేరిన తరువాత సమాధానం పంపుతారట

మతసామరస్యంపై కామరాజ్, శాస్త్రిగార్లతో ముస్లింకాంగ్రెస్‌వాదుల చర్చ

దుర్గాపూర్ జనవరి 9

ప్రముఖ ముస్లిం కాంగ్రెసువాదులు పలుగురు నేడిక్కడ కాంగ్రెసు అధ్యక్షుడు కామరాజ్, ప్రధాని శాస్త్రి గార్లను కలుసుకొని దేశంలోని మతసామరస్య సమస్యపై చర్చలు జరిపారు కేంద్రహోంమంత్రిశ్రీనందాకాంగ్రెస్ కార్యవర్గసభ్యులు శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ గార్లు కూడా ఆ చర్చలో పాల్గొన్నారు

అంతర్జాతీయ విధాన తీర్మానానికి ఆమోదం

దుర్గాపూర్ జనవరి 10

అంతర్జాతీయ వ్యవహారాలపై తీర్మానాన్ని కాంగ్రెస్ మహాసభ నేడు ఏకగ్రీవంగా ఆమోదించింది

ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడమీ కౌన్సిల్ సభ్యులుగా రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి శ్రీ భగవాన్‌దాస్ నియమితులైనారు

కాంగ్రెస్ కార్యవర్గానికి దర్బారాసింగ్ ఎన్నిక

దుర్గాపూర్ జనవరి 10

పంజాబు హోంమంత్రి శ్రీ దర్బారాసింగ్ కాంగ్రెసు కార్య నిర్వాహక వర్గ కమిటీ సభ్యులుగా ఎన్నికయినట్లు నేడొకప్రకటన వెలువడింది

దర్బారాసింగ్‌కు 170 ఓట్లురాగా ఈయనతో పోటీ చేసిన కేంద్ర మాజీ మంత్రి శ్రీ కె డి మాలవీయాకు 99 ఓట్లు వచ్చాయి

పోలయిన 270 వోట్లలో ఒకవోటు చెల్లలేదు

ఎన్నిక ఫలితాన్ని కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి శ్రీ టి మనేన్ ప్రకటించారు. ఈయనే రిటర్నింగ్ ఆఫీసరుగా పనిచేశారు.

రాజేశ్వరరావుగారికి రైలుస్టేషన్‌లో స్వాగతం

విజయవాడ కమ్యూనిస్టు సమితిచే ఏర్పాటు

విజయవాడ జనవరి 9

భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ చండ్ర రాజేశ్వర రావుగారు విజయవాడ వస్తున్న సందర్భంలో పట్టణ కమ్యూనిస్టు సమితి స్వాగత సన్నాహాలు ఏర్పాటు చేసింది

శ్రీ రాజేశ్వరరావుగారు పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన అనంతరం ఆంధ్రదేశానికి రావడం ఇదే మొదటిసారి ఆయన త్రిచూర్ నుంచి హౌరా ఎక్స్‌ప్రెస్ లో సాయంత్రం 6 గంటలకు విజయవాడకు వస్తున్నారు

కేరళ కమ్యూనిస్టు సమితి సమావేశంలో పాల్గొనడానికి శ్రీ రాజేశ్వరరావుగారు త్రిచూర్ వెళ్ళారు

విజయవాడ పట్టణ కమ్యూనిస్టుసమితి తరపున రైల్వే స్టేషన్‌లోకమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శికి స్వాగతమిచ్చి తరువాత ఆయనను ఊరేగింపుతో గవర్నరుపేటలోని పట్టణ కమ్యూనిస్టు సమితి కార్యాలయానికి తీసుకురావడానికి ఏర్పాట్లుచేశారు.

శ్రీ తాపి ధర్మారావు గారికి అస్వస్థత

విజయవాడ జనవరి 10

ఆంధ్ర విశారద శ్రీ తాపి ధర్మారావుగారు హైదరాబాద్‌లో ఈ రోజు అస్వస్థులైనట్లు తెలుస్తున్నది.

ఉస్మానియా విశ్వ విద్యాలయ అంతర్ కళాశాల యువజనోత్సవాలు జనవరి 9 10 తేదీలలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరుగుతాయి.

గోదావరి బ్యారేజి సమస్య పరిశీలనకు కేంద్రనిపుణుల సంఘం

శ్రీ ఏ. సి. మిత్రా నాయకత్వాన నియామకం

న్యూఢిల్లీ జనవరి 9

గోదావరి డెల్టా ప్రాంతంలో నీటిపారుదలను విస్తృత పరచేందుకు గోదావరి బ్యారేజిని ఎక్కడ ఏరూపంలో నిర్మించాలో పరిశీలించి నివేదిక సమర్పించేందుకు కేంద్రప్రభుత్వం నిపుణుల సంఘాన్ని నియమించింది ఈ సంఘానికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ నీటిపారుదలశాఖ సలహాదారు శ్రీ ఎ సి మిత్రా నాయకత్వం వహిస్తారు

గోదావరి నదిపై ధవళేశ్వరంవద్ద ఉన్న ఆనకట్ట పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వ అధికారులు పూనా నీటి విద్యుచ్ఛక్తి పరిశోధక కేంద్రం జరిపిన పరిశీలనను ముందుగా వీరు పరిశీలిస్తారు

ఈ పరిశీలన జరిపిన అనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆనకట్టవద్ద 8 అడుగుల ఎత్తున 'డ్రమ్ గేట్ల'ను నిర్మించాలని సూచన చేసింది ఇప్పటికే 10 లక్షల ఎకరాలకు ఈ డెల్టా ప్రాంతంలో నీటి పారుదల సౌకర్యం కలిగింది అదిందని 'డ్రమ్ గేట్ల'ను నిర్మించటంద్వారా ఈ సౌకర్యాన్ని ఇంకా విస్తృతపరచవచ్చునని రాష్ట్రప్రభుత్వంతెల్పింది ప్రస్తుతమున్న జలాశయ నీటిమట్టానికే ఆనకట్ట దెబ్బతినకుండా వుంటుందనే నమ్మకం లేదని ఈ పరిస్థితుల్లో ఇంకా నీటిమట్టం పెంచడం వాంఛనీయం కాదని ఈ పరిశీలన తెల్పుచున్నది ప్రస్తుతమున్న ఆనకట్టకు రక్షణం రక్షణ కల్పించేందుకు కొత్త బ్యారేజినినిర్మించేందుకు పరిశీలన జరపవలసిన అవసరాన్ని రాష్ట్ర ప్రభుత్వాధికారులు పూనా పరిశోధక సంస్థ తమ పరిశీలనానంతరం తమ నివేదికలో పేర్కొన్నారు

దేశ ఆర్థిక పరిస్థితిల్లో ముఖ్యంగా అధిక ఆహారోత్పత్తి రంగంలో గోదావరి బ్యారేజి పథకానికి అత్యంత ప్రాముఖ్యం వున్నది ప్రస్తుతం ఉన్న ఆనకట్టల రక్షణకు తక్షణ చర్యలను తీసుకుంటూ బ్యారేజిని నిర్మించటం ద్వారా నీటిపారుదలను విస్తరింపజేయవలసిన ఆవశ్యకత ఎంతోవుంది

నిపుణుల సంఘాన్ని రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించి కేంద్రప్రభుత్వం నియమించింది, ప్రస్తుతమున్న ఆనకట్టల రక్షణకు తక్షణం తీసుకోవలసిన చర్యలను మూడు మాసాలలోపు ఈ సంఘం సూచిస్తుంది.

ఈ సంఘంలో డా యస్ వి బోగ్లేకర్ (గౌరవ సభ్యుడు) నీటి పారుదల విద్యుచ్ఛక్తి మంత్రిత్వశాఖ ప్రతినిధి చీఫ్ ఇంజనీర్ శ్రీ ఎ కె ధార్ రాణాప్రతాప్ సాగర్, కోటా లు సభ్యులుగా వున్నారు

కేంద్ర జల విద్యుత్ కమిషన్ సభ్యులు శ్రీ ని యల్ హండా ఈసంఘానికి కార్యదర్శిగా వ్యవహరిస్తారు

కార్యక్రమం, కర్తవ్యం యెడ కాంగ్రెసువాదుల నిర్లక్ష్యవైఖరి

రెండువేలమంది ప్రతినిధుల్లో 150 మంది కూడా లేని రెండవరోజు కాంగ్రెసుమహాసభ

దుర్గాపూర్ జనవరి 10

నేడుదయం 9 గంటలకు కాంగ్రెసు 69 వ మహాసభ సమావేశం ప్రారంభమైన వేళకు రెండువేల పైచిల్లరవున్న ప్రతినిధులలో నూటఏభయిమందికూడ సభలో లేరు కాంగ్రెసు కార్యవర్గంలో ఖాళీ పడిన స్థానానికి ఎవరిని ఎన్నుకోవాలనే ప్రశ్నతో కాంగ్రెసు నాయకులూ, ఏ ఐ సి సి సభ్యులూ వేదిక వెనుకచేరి మల్లగుల్లాలు పడుతున్నారు సభలో "కాంగ్రెసువాదుల కర్తవ్యాలు" అనే పేరున కార్యక్రమంమీద తీర్మానం చర్చించబడుతూంది

కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ కామరాజ్ సరిగా 9 కొట్టేసరికి వేదిక నధిష్టించారు, తీర్మానం మీద చర్చ ప్రారంభమయింది.

అన్నం బట్ట చదువు ఇల్లువంటి కనీసావసరాలను సమకూర్చగల హామీవుంటే తప్ప కాంగ్రెసువాదులు ప్రజలలో పనిచేయలేరని శ్రీమతి సుశీలా సింఘే (వ బెంగాల్) అన్నారు

కాంగ్రెసువాదులు పనిచేసి వుండకపోతే కాంగ్రెసు ప్రభుత్వాధికారంలోకి ఎన్నుకొనబడి వుండదని శ్రీ శిబ్‌బోస్ (ప బెం) అన్నారు. అధికారం వచ్చేక కాంగ్రెసువాదులు ప్రభుత్వ నిర్వహణకు సంబంధి చినవారుగా సంస్థ నిర్మాణానికిచెందినవారుగా, విడిపోయేరన్నారు ప్రభుత్వ నిర్వాహకులుగా వున్నవారు ప్రజల కెక్కువ సేవచేయగల స్థితిలో వున్నారని కాంగ్రెసులోని ఈ రెండు విభాగాలూ ఐకమత్యంగా కాంగ్రెసు కార్యక్రమాల నమలు జరిపేటట్లు వారి కార్యకలాపాలను సమన్వయ పరచాలని అన్నారు

మహాత్మాగాంధీ జవహర్లాల్ నెహ్రూ సుభాష్‌బోసులు విడిచివెళ్ళిన మహత్కార్య నిర్వహణకు కాంగ్రెసు వాదులలో అత్యధిక ఐక్యత కావాలని శ్రీ బి ఎన్ శుక్లా (బొంబాయి) అన్నారు.

దొంగ వర్తకులూ అధికలాభార్జనపరులూ ప్రజల దుస్థితి నుపయోగి చుకొనిలాభపడకుండా చూడాలని శ్రీ బి ఎన్ జాదవ్ (బీహార్) అన్నారు ఆ విషయంలో కాంగ్రెసువాదుల మీద విశేష బాధ్యతవున్నదన్నారు.

పల్లెటి పట్టులలో పనిచేస్తున్న కాంగ్రెసు వాదులు దారిద్ర్యం, అవిద్య నిరుద్యోగమూ తోనే గాకుండా కులతత్వం భాషా దురభిమాన ములతోకూడ కుస్తీపట్టవలసి వస్తున్నదని శ్రీ రాజబహదూర్ త్రివేది (ఉ ప్ర) అన్నారు కుల తత్వ భాషా దురభిమానంతొలగించబడితే తప్ప విచ్ఛిన్నకారి ధోరణులు వెనుకబట్ట వన్నారు ఇటీవల నిర్మాణంలో వచ్చిన మార్పుల

(మిగతా 3 వ పేజీలో)

విశాలాంధ్ర

సంక్రాంతి ప్రత్యేక సంచిక

జనవరి 14, 1965

సంక్రాంతి సందర్భంగా 14-1-65 న "విశాలాంధ్ర ప్రత్యేక సంచికగా ఆకర్షణీయంగా వెలువడుతుంది వ్యాపార ప్రకటనలకు యీ సంచిక ఎంతో ఉపయోగపడుతుంది వ్యాపారస్థులు దీనిగడవలెనే మమ్ము ప్రోత్సహిస్తారనినమ్ముతున్నాం. పాఠకులు, ఏజెంట్లు తమతమ కాపీలు రిజర్వు చేసుకోవలెను.

— మేనేజరు 'విశాలాంధ్ర'

విశాలాంధ్ర

తిరోగమనానికి అంకురార్పణ

కాంగ్రెస్ 69 వ మహాసభ విషయ నిర్ణయ సంఘం ఆర్థిక సాంఘిక విధానాలపై సుదీర్ఘమైన తీర్మానాన్ని ఆమోదించింది తీర్మానం ప్రస్తుత రూపంలో వెలువడకముందు రచనా సంఘం తయారు చేసిన ముసాయిదాపై కార్యవర్గంలో కొంత తర్జన భర్జనచెలరేగిందని కేవలం సైద్ధాంతిక సూత్రాల పునశ్చరణను విడనాడి ఒక నిర్దిష్ట కార్యక్రమాన్ని తీర్మానంలో పొందుపరచడం జరిగిందని వార్త

"ప్రజాస్వామ్యం సోషలిజం' పై భువనేశ్వర్ కాంగ్రెస్ తీర్మానం అమలు జరిగిన ఈ ఏడాదిలో కాంగ్రెస్ తీర్మానాలవిలువ, రూపాయి విలువకన్నా త్వర త్వరగా పడిపోతున్న విషయం కాంగ్రెస్ వాదులు కూడ గుర్తించక తప్పలేదు

అందువల్లనే, ఆర్థిక సాంఘిక విధానాల తీర్మానంపై జరిగిన చర్చ సందర్భంలో "ఇది చెల్లని పత్రం' అని ఒకరంటే, "ఒక టన్ను చక్కని వాక్యాల కన్న పీసమెత్తు ఆచరణ మంచిది' ని మరొకరన్నారు "కాగితాలపై మిగిలిపొయ్యే తీర్మానాలవల్ల ప్రయోజనమేమి? - ఇదీ తీర్మానంపై ప్రసంగించిన ప్రతినిధులనేకులు కాంగ్రెస్ నాయకత్వాన్ని అడిగినప్రశ్న సభలో హర్షధ్వానాలు వచ్చింది, నాయకుల నుండి జవాబురానిది ఈ ప్రశ్నకే!

అయినప్పటికీ ఈ దఫా ఏవో సిద్ధాంతాలు కాక ఒక నిర్దిష్ట కార్యక్రమాన్ని తమ పార్టీ ముందు ప్రజల ముందు ఉంచామంటున్నారు కాబట్టి ఈ తీర్మానాన్ని జాగ్రత్తగా పరిశీలించడం అవసరం

నాల్గవ ప్రణాళికను రూపొందించడానికి మార్గ దర్శకమని చెప్పబడిన ఈ తీర్మానంలో ప్రభుత్వరంగ విస్తరణను గురించి ప్రస్తావించకపోవడం యాదృచ్ఛికం కాదు

సర్వసాధారణంగా వివాదాలను రేకెత్తించే విషయాల ప్రసక్తిలేని ఒక తీర్మానం కాంగ్రెసు విషయ నిర్ణయ సంఘం ముందుకు రావటం ఇదే ప్రథమ పర్యాయం ఈ తీర్మానానికి గల ప్రత్యేకత ఇందులోనే వుంది ఇందులో మిశ్రమ ఆర్థిక విధానం రోజు రోజుకు విస్తరిస్తున్న ప్రభుత్వ రంగ పాత్ర, సహకార పారిశ్రామిక రంగం, జాతీయకరణ, కంట్రోళ్లు మొదలయిన వాటి ప్రస్తావనలేదు' అని 'హిందూ' విలేకరి శ్రీ కె రంగస్వామి సంతోషాతిశయంతో చేసిన వ్యాఖ్యనుబట్టి ఇది ఉద్దేశ పూర్వకంగానే జరిగిందని ఊహించవచ్చు

అందువల్ల' పెద్దపరిశ్రమలలోను వాణిజ్యం లోనూ ప్రభుత్వ రంగం క్రమానుగతంగా అభివృద్ధి చెందాలి' అని భువనేశ్వర్ తీర్మానంలో అతి స్పష్టంగా చెప్పిన మాటలకు ఈ తీర్మానం చెల్లుచీటి కానున్నదా అనే అనుమానం కలుగుతున్నది

వినిమయ పరిశ్రమలతో సహా ప్రభుత్వ రంగంలో నెలకొల్పబడే పరిశ్రమలలో ప్రైవేటు పెట్టుబడులకు ప్రోత్సాహమివ్వాలని శ్రీకృష్ణమాచారి దుర్గాపూర్ కాంగ్రెస్‌కు కొద్ది రోజులు ముందే జరిగిన జాతీయాభివృద్ధి సమితి వనరుల కమిటీలో సూచించడం కూడాగమనార్హం

ప్రభుత్వరంగానికి కేటాయించిన పరిశ్రమలను కొన్నింటిని ప్రయివేటు రంగానికి అప్పజెప్పటమేకాదు ప్రభుత్వ రంగంలోనే ప్రైవేటు రంగం జొరబడుతుందన్నమాట

ద్రవ్యోల్బణం ధరల పెరుగుదల పేరుతోనూ నాల్గవ ప్రణాళికకు అవసరమయిన వనరులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సేకరించడం తలకు మించిన భారమనే కారణం తోనూ నాల్గవప్రణాళికపరిమాణాన్ని పునః పరిశీలించాలని శ్రీ కామరాజ్ మహాసభ అధ్యక్ష పీఠంనుండి ఇచ్చిన సలహాకూడ ఈఅనుమానాలను దృఢపరుస్తున్నాయి ఎందుకంటే ప్రణాళిక పరిమాణం కుదింపులో మొదట కత్తిరింపబడేవి ప్రభుత్వ రంగంలో నెలకొల్పా లనుకొనే భారీ పరిశ్రమలే

గుత్త పెట్టుబడిదారీ సంస్థల ప్రాబల్యాన్ని తగ్గించడంలో ప్రధాన సాధనం కావలసిన ప్రభుత్వ రంగానికి ఈ దుర్గతి పట్టిన తరువాత "ఆర్థికాధికార కేంద్రీకరణను, గుత్త పెట్టుబడిదారీ విధానాన్ని అరికట్టే విధానాలకు చర్యలకు నాల్గవ ప్రణాళికలో ప్రత్యేక ప్రాముఖ్యమివ్వాలని చెప్పడం హాస్యాస్పదం "గుత్త పెట్టుబడిదారీసంస్థలను బద్దలు చేయాలని తీర్మానం ప్రవేశ పెడుతూ శ్రీ జగ్జీవన్‌రాం వెల్లడించిన వాంఛ తీరడం కల్ల మనఆర్థిక వ్యవస్థపై గుత్త పెట్టుబడిదారుల పట్టు మరింత పెరగడం ఖాయం

పరిశ్రమలమాట అలా వుంచి వ్యవసాయ రంగానికి ప్రాధాన్యమిచ్చే విధానాన్ని చేపడుతున్నామని ప్రధాని శాస్త్రి మొదలు కాంగ్రెస్‌లోని అగ్ర నాయకులంతా చెప్పుతున్నారు గదా అనవచ్చు

తీర్మానంలో రూపొందించిన విధానాలు వ్యవసాయాభివృద్ధికి ఎంతవరకు తోడ్పడగలవనేది పరిశీలిద్దాం

మూడవ ప్రణాళిక ఆఖరులోగా వ్యవసాయ సంస్కరణల కార్యక్రమాన్ని పూర్తి చేయాల'ని. ఆ విధంగా 'తమ భూమిపై యాజమాన్యమూ, లేక జిరాయతీహక్కులూ సంపాదించుకొనే రైతులకు ఇతోధిక ఋణ సౌకర్యాలు కలుగ జేయాలని తీర్మానంలో సూచించారు

పూర్తి చేయవలసిన భూ సంస్కరణలు ఎటువంటివో కూడ వెల్లడించారు ఈ సంస్కరణకు అవసరమయిన చట్టాలు అనేక రాష్ట్రాలలో ఇదివరకే ఆమోదింప బడ్డాయట ఈ చట్టాల సంగతి మనకు అనుభవైద్యమే గరిష్టపరిమితి చట్టంద్వారా గ్రామీణ పేదలకు సెంటు భూమి కూడ లభించలేదు ఆంధ్రలో కౌలు దారీచట్టంవల్ల సాగుదార్లకు జిరాయతీ హక్కులు లభించకపోగా వందలాది మంది బేదఖల్ అయ్యారు చట్టాలలో ఉద్దేశ పూర్వకంగానే వుంచిన లొసుగులవల్లనేమి, వాటిని అమలు జరిపే పద్ధతివల్లనేమి పైసంస్కరణ వల్ల దున్నేవానికి భూమి లభించలేదనేది బహిరంగ రహస్యంకాగా ఆ సంగతిని దాటవేసి, వీటివల్ల భూమిపై యాజమాన్యం పొందే రైతులకు పరపతి సౌకర్యాలు ఏర్పరుస్తామనడం పుండుపై కారంచల్లడమనే చెప్పాలి

పైగా పంచాయతీరాజ్ సంస్థల ద్వారా సహకార సంస్థలద్వారా అందజేయాలనే ఈ పరపతి ఎవరికందుతుందో కూడా అందరకి తెలుసు ఋణభారంతో కుంగిపోతున్న పేద రైతులు వ్యవసాయ కార్మికులుకాక ఈ సంస్థలను ఆక్రమించుకొన్న భూస్వాములు ధనిక రైతులు మాత్రమే వీటి లాభాలు పొందుతున్నారు.

పోతే, గ్రామీణప్రాంతాలలో వ్యవసాయ పారిశ్రామికకార్పొరేషన్లు నెలకొల్పానే సూచన అమలు జరిగితే వ్యవసాయ కార్మికులకు తదితర గ్రామీణ పేదలకు కొంత ఉపాధి ఏర్పడుతుంది ఇందుకు ప్రతి రాష్ట్రంలోను వ్యవసాయ పారిశ్రామిక కార్పొరేషన్లు ఏర్పడాలనే సూచన హర్షించదగిందే కాని ఈపరిశ్రమలకు అవసరమైన యంత్రాలు తదితర పరికరాలు సరఫరా కావాలంటేమొదట యంత్రోత్పత్తిపరిశ్రమలను స్థాపించాలనే విషయం మరువరాదు ఆ దృష్టితో చూచినప్పుడు ఈ సూచన అమలు జరుగ గలదా? అనే అనుమానం కలుగకమానదు

నేడున్న అధిక ధరలకు, ముఖ్యంగా ఆహార ధాన్యాల ధరల పెరుగుదలకు, తద్వారా ఏర్పడిన సంక్షోభానికి బ్యాంకులు నిల్వదారులు దొంగవ్యాపారులుఅనేవిషయంస్పష్టం ఆహార కార్పోరేషన్‌ను స్థాపించడం తోనే సమస్య పరిష్కారం కాదని ఇప్పటికే తేలిపోయింది ఎందుకంటే పంటలు చేతికందిన ఈ రోజుల్లోనే ఆహార పదార్థాల ధరలు మును పెన్నడూలేనంతగా పెరిగాయి

అందువల్లనే, ప్రభుత్వం వెంటనే ఆహార పదార్థాల పంపిణీని తక్షణమే చేపట్టకపోతే వచ్చే 3, 4 నెలల్లో తీవ్రపరిణామాలు తప్పవని శ్రీ గాడ్గిల్ వంటివారే హెచ్చరిస్తున్నారు అయితే కాంగ్రెస్ తీర్మానంలో రానున్న పరిణామాలపట్ల ఆందోళనగాని వాటినిఎదుర్కొనడానికిఉద్దిష్టమైన కార్యక్రమంకాని కనిపించదు

ఆహార ధాన్యాల వినిమయం విషయంలో దేశానికంతటికి అన్వయించే పథకంయొక్క అవశ్యకతను గూర్చి అస్పష్టంగా చెప్పడం తప్ప న్యాయమైన ధరలకు ఆహార ధాన్యాదులను ప్రజలకు అందించే ఏర్పాట్లను గురించి తీర్మానం మౌనం వహించింది అమెరికా ధాన్యంతోనే సంక్షోభాన్ని అధిగమించగలమనేధోరణిలోనే ప్రభుత్వాధినేతలు వున్నారని కనిపిస్తున్నది

ఇక ప్రభుత్వ యంత్రాంగంలో మంత్రిపర స్థాయివరకు వ్యాపించిన అవినీతిని నిరోధించడంలోను గుప్త ధనాన్ని వెలికి తీయడంలోను ప్రభుత్వ వైఫల్యాలకు కారణమేమిటో ఆత్మశోధన చేసుకోవలసిన తరుణంలో కాంగ్రెస్ నాయకత్వం ఆత్మసంతృప్తిని వెల్లడించటం బూర్జువా పత్రికలకే కొంత వెగటుపించింది ఈ వైఖరిగల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజోద్యమాల ఒత్తిడి లేనిదే ప్రస్తుత సంక్షోభాన్ని పరిష్కరించగలదనుకోవడం వట్టి భ్రమ

నేడు దేశాన్ని ఎదుర్కొంటున్న సంక్షోభం అనేక రూపాలలో మనకు కనిపిస్తున్నది ప్రణాళికల లక్ష్యాలు నెరవేరడంలేదు వాటిని పూర్తిచేయడానికి తగు వనరులు లేవు ధరలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి ఉత్పత్తి మందగించింది అవసరాలకు అవకాశాలకు తగినట్లుగా శీఘ్రగతితో ఆర్థికాభివృద్ధి సాగడంలేదు

సోషలిజం పేరు చెప్పుతూ ఆచరణలో దేశాన్ని పెట్టుబడిదారీ పంథాలో అభివృద్ధి చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలే, బహుముఖంగా కనిపిస్తున్న ఈసంక్షోభానికి మూలకారణం ఈ పంథాలో జరిగే పారిశ్రామికీకరణ వల్ల కలిగే లాభాలు కొద్దిమంది గుత్త పెట్టుబడిదారులకు తదితర దోపిడి వర్గాలకు దక్కగా, పారిశ్రామికీకరణ భారమంతా ప్రజలపై పడుతోంది ఫలితంగా సంక్షోభం మరింత ఉగ్ర రూపం ధరిస్తుంది

ఈ విషవలయాన్ని ఛేదించాలంటే గుత్త పెట్టుబడిదారీ వర్గాల ప్రాబల్యాన్ని కొంతవరకైనా బద్దలు కొట్టాలంటే ప్రజల భారాన్నితగ్గించాలంటే బ్యాంకులను ఎగుమతి దిగుమతి వ్యాపారాన్ని, నూనె పరిశ్రమను జాతీయం చేయడం, ఆహార ధాన్యాల టోకు వ్యాపారాన్ని ప్రభుత్వ పరం చేయడం రైతులకునిజంగా భూమి నిచ్చేవ్యవసాయ సంస్కరణలుఅమలు జరపడం అవసరం

కాంగ్రెస్ తీర్మానంలో ఈ దృష్టి లేకపోవడం ఆశ్చర్యంకాదు కాని కాంగ్రెస్‌లోని అభ్యుదయ శక్తులు ఈ దృష్టితో దుర్గాపూర్ మహాసభలో గట్టిగా పోరాడకపోవడం శోచనీయం

కేవలం మహాసభ వేదికనుండి ఉపన్యాసాలివ్వటం మాత్రమే చాలదు ప్రత్యామ్నాయ విధానాలకోసం గట్టిగా నిలబడాలి అందుకై పోరాడుతున్న ఇతర అభ్యుదయకర ప్రతిపక్షాలతోను, సంస్థలతోనూ సహకారం నెరపాలి

అధికార పార్టీపై గుత్త పెట్టుబడిదారుల ఒత్తిడి ఈ తీర్మానంలో స్పష్టంగా ప్రతిబింబితమౌతూవుంది దుర్గాపూర్ కాంగ్రెసు దేశ తిరోగమనానికి నాంది కారాదు. ఈ విధానాలను ఎదుర్కొనేందుకు అన్ని అభివృద్ధికర పార్టీలు శక్తులు సమైక్యంగా పోరాడాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

'సినిమాలు-సమాజం' అంశంపై ఢిల్లీలో గోష్ఠి

అంతర్జాతీయ ఫిలిం ఉత్సవాల సందర్భంగా

న్యూఢిల్లీ జనవరి 9

యువతరంలో వ్యక్తిత్వం పెరగటానికి సినిమాలు ఎక్కువగా ఉపకరిస్తాయని నేడు కేంద్ర సమాచార ప్రసార శాఖామంత్రి శ్రీమతి ఇందిరా గాంధి 'సినిమా-సమాజం' అనే అంశంపై గోష్ఠిని ప్రారంభిస్తూ అన్నారు ఈ గోష్ఠి 6 రోజులపాటు జరుగుతుంది

సినిమాలు జీవితంలోని అన్ని రంగాలను ప్రతిబింబించాలని ఆమె అన్నారు. జీవిత సూత్రాలు మారుతున్నప్పటికి జీవితశాశ్వత విలువలు మారవని ఆమెచెప్పారు

ప్రజలకు జ్ఞానాన్ని ప్రసాదించటంలో భారతీయ చిత్రాలు వెనుకబడి పోతున్నాయని ఆమెవిచారం వ్యక్తంచేశారు భారతీయచిత్రాలు విజ్ఞాన వినోదాలను ప్రజలపై ప్రసరింపజేయలేక పోతున్నాయని ఆమె అన్నారు.

చిత్రాలలో ఇతర విషయాలపట్ల కన్నా ధనాన్ని ఆర్జించే విషయం పైనే నిర్మాతలు కళాకారులు కేంద్రీకరిస్తున్నారని ఆమెఅన్నారు కళాకారుడు తాను భావించిన విధంగా భావాన్ని వ్యక్తీకరించే స్వాతంత్ర్యం వుండాలనటం సమంజసమే అయినప్పటికీ, సాంఘిక, విద్యాభివృద్ధికి అధికతర ప్రాముఖ్యం యివ్వాలనిఆమె చెప్పారు.

బాలల చిత్రాలకు కొన్ని దేశాలలో మాత్రమే ప్రత్యేక శాఖలు ఏర్పడ్డాయని ఆమె అన్నారు

ఇక్కడ జరుగుతున్న అంతర్జాతీయ ఫిలిం ఉత్సవాలలో భాగంగా ఈ గోష్ఠి ఏర్పాటు చేయబడింది. ఈ గోష్ఠిలో 12 మంది విదేశీయులు, 15 మంది భారతీయులు పాల్గొంటున్నారు.

మొదటిరోజు గోష్ఠిలో "జాతీయ జీవిత, సాంస్కృతిక ప్రతిబింబంగా చిత్రాలు' అనే అంశంపై చర్చ సాగింది. 7 గురు విదేశీయులు ముగురు భారతీయులు తమ అభిప్రాయాలను వ్యక్తంచేస్తూ పత్రాలను సమర్పించారు. డా ముల్కరాజ్ ఆనంద్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు

సినిమా ఈ యుగంలో ఆదర్శాల బోధనకు ముఖ్య సాధనంగా ఉపయోగపడుతున్నదని, ఇది అంతర్జాతీయ స్థాయిలో జరుగుతుందని డా ముల్కరాజ్ ఆనంద్ అన్నారు

"కాంగ్రెసు ప్రభుత్వం పిరికితనానికి ఈ అరెస్టులు చక్కని నిదర్శనం",

దేశవ్యాప్తంగా పోటీ పార్టీ నాయకులను నిర్బంధించడంపై బొంబాయి సభలో శ్రీ డాంగే విమర్శ

బొంబాయి జనవరి 8

పోటీ కమ్యూనిస్టుపార్టీ నాయకులను దేశవ్యాప్తంగా అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ పిరికితనాన్ని సూచిస్తున్నదని కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షులు శ్రీ ఎస్ ఏ. డాంగే యిక్కడ జరిగిన గొప్ప బహిరంగసభలో ప్రసంగిస్తూ పేర్కొన్నారు

ఆ బహిరంగసభను జనవరి 8 వ తేదీన కాంగార్ మైదానంలో బొంబాయినగర కమ్యూనిస్టు సమితి ఏర్పాటు చేసింది

[శ్రీ డాంగే ప్రసంగానికి సంబంధించిన కొన్ని భాగాలను పి టి ఐ వార్తాసంస్థ అందచేసినంతవరకు లోగడనే 'విశాలాంధ్ర'లో ప్రకటించాము. ఇప్పుడు 'విశాలాంధ్ర ప్రత్యేక విలేకరి పంపిన దానిని వివరంగా ప్రకటిస్తున్నాము. సం]

'భారత్ బంద్'ఉద్యమాన్ని ఆహార ఆందోళనను కొనసాగించాలని కమ్యూనిస్టుపార్టీ చేసిన నిర్ణయంలో ఎట్టిమార్పు వుండబోదని శ్రీ డాంగే ప్రకటించారు

మహాత్మాగాంధీ హంతకులకు ఈ మధ్య పూనాలో జరిపిన సన్మానాలను అరికట్టలేకపోయిన ప్రభుత్వానికి తన రహస్యశాఖ సేకరించిన సమాచారం నమ్మదగినదని చెప్పుకొనే హక్కులేదని శ్రీ డాంగే విమర్శించారు.

హింసా పద్ధతులద్వారా ప్రభుత్వాన్ని కూలద్రోయడానికి పోటీ కమ్యూనిస్టు పార్టీ వారు పన్నిన కుట్రను కొద్దిరోజులలోనే తమ రహస్యశాఖ బయట పెట్టినదని ప్రభుత్వం చెబితే, నమ్మడం ఎలాగని ఆయన ప్రశ్నించారు.

పోటీ కమ్యూనిస్టు పార్టీ నాయకులను పెద ఎత్తునఅరెస్టుచేసిన వెనువెంటనే, కేంద్రహోమ్ మంత్రి శ్రీ నందా ప్రత్యేకంగా సమావేశపర్చిన పార్లమెంటు సభ్యులలో జనసంఘం ప్రతినిధి కూడా వుండటం గమనార్హమని శ్రీ డాంగే పేర్కొన్నారు.

ప్రస్తుతం దేశాన్ని ఆవహించిన ఆహార సంక్షోభం నుండి ప్రజల దృష్టిని మళ్ళించడానికి ప్రభుత్వం పన్నినపన్నాగంగా ఈ అరెస్టులను చూడాలని శ్రీ డాంగే వివరించారు

పోటీ కమ్యూనిస్టుపార్టీ సాయుధ తిరుగుబాటు ప్రారంభించాలన్న యోచనను ఆచరణలో పెట్టజూస్తున్నదని ప్రభుత్వం ఆరోపిస్తున్నది కాని సాయుధ తిరుగుబాటు భారత ప్రజల ఆమోదం పొందగలదని ఎవరూ కలలో కూడా ఊహించలేరని ఆయన అన్నారు హింసాత్మక విప్లవం అన్న భావాన్ని ప్రజలు ఆమోదిస్తారని ఎవరైనా అంటుంటే అలాంటి వారు విప్లవ పదజాలాన్ని చిలుకలవలె వల్లిస్తున్నారని మాత్రమే చెప్పవలసివస్తుందని ఆయన అన్నారు

దేశంలో హింసాత్మకమైన ఉద్యమాలు ప్రారంభించగలిగిన సత్తా పోటీ కమ్యూనిస్టు పార్టీ వారికి ఎంత మాత్రం లేదని తాను గట్టిగా అభిప్రాయ పడుతున్నానని శ్రీ డాంగే పేర్కొన్నారు

పైగా పోటీ కమ్యూనిస్టుపార్టీ సాయుధ తిరుగుబాటుకు కుట్ర తలపెట్టినట్లు ప్రభుత్వం ఎలాంటి రుజువులను బయట పెట్టలేదు కనుక ప్రజల దృష్టిని పెడమార్గ పట్టించడానికే తాను సృష్టించిన సంక్షోభం నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే ప్రభుత్వం ఈ అరెస్టులను జరిపినదని అనుకోవలసివస్తున్నదని ఆయన అన్నారు

ఇక ప్రభుత్వం చెబుతున్న జాతీయ వ్యతిరేక కార్యకలాపాల సంగతి అంటారా అలాంటి కబుర్లువిని, మోసపోయే జనం దేశంలోలేరు 'జాతీయవ్యతిరేక కార్యకలాపాలు' అనే నినాదం చాటున కాంగ్రెసు ప్రభుత్వం తన ప్రజా వ్యతిరేక పెట్టుబడిదారీ అనుకూల విధానాలను కప్పి పుచ్చుకో చూస్తున్నదని, శ్రీ డాంగే విమర్శించారు

పెట్టుబడిదార్లు దొంగ వ్యాపారుల ప్రయోజనాలు రక్షిస్తున్న కాంగ్రెసు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలలో కనీసం 7 లక్షలమందినైనా జైళ్ళకు పంపడానికి కమ్యూనిస్టుపార్టీ సిద్ధంగా వున్నదని పార్టీ అధ్యక్షులు శ్రీ డాంగే ప్రకటించారు

ప్రజలకు తిండిపెట్టే విషయంలో కాంగ్రెసు ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. అదే సమయంలో అది గుత్తాధిపతుల దొంగ వ్యాపారుల ప్రయోజనాలను మాత్రం సిగ్గువిడిచి కాపాడుతున్నది ఈ విషయం ప్రజాసామాన్యానికి బాగా తెలుసునని శ్రీ డాంగే పేర్కొన్నారు.

ఇంత పెద్ద యంత్రాగాన్ని-పోలీసు సిబ్బందిని రహస్య శాఖను - చేతికో పెట్టుకొని ప్రభుత్వం ఎందువల్ల దొంగ వ్యాపారులను పట్టుకోలేకపోతున్నది? దొంగ వ్యాపారులను పట్టుకోవడంలో విఫలమైన ప్రభుత్వమే పోటీ కమ్యూనిస్టుపార్టీ పన్నిన కుట్రను ఏ విధంగా పట్టుకోగలిగిందని శ్రీ డాంగే ప్రశ్నించారు

దేశాన్నెదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించలేకపోతున్న కాంగ్రెసు ప్రభుత్వం దేశరక్షణ నిబంధనల వంటి అత్యవసర అధికారాలను వినియోగించి తన పాలనను కొనసాగించ చూస్తున్నదని శ్రీ డాంగే అన్నారు

దొంగవ్యాపారులను దొంగ నిల్వదారులను అరెస్టు చేయడంలో ప్రభుత్వం విఫలం కావడమేకాదు బ్రిటిషు గూఢచారిగా వ్యవహరిస్తూ జాతీయ వ్యతిరేక కార్యకలాపాలలో నిమగ్నమైయున్న బ్రిటిషు ఔషధ పరిశ్రమ జనరల్ మేనేజరును అరెస్టు చేయడానికి నిరాకరిస్తున్నది అలాంటి గూఢచారులు మన దేశంలో యధేచ్ఛగా తిరుగుతున్నారు. కాని ప్రజల బాధల నివారణకు ఉద్యమాలు నిర్వహిస్తున్న కార్యకర్తలను మాత్రం ప్రభుత్వం దేశరక్షణ నిబంధనల క్రింద జైళ్ళలో నిర్బంధిస్తున్నదని శ్రీ డాంగే నిశితంగా విమర్శించారు.

శ్రీ డాంగే తన ప్రసంగంలో కమ్యూనిస్టు పార్టీకి పోటీ కమ్యూనిస్టుపార్టీకిగల మౌలిక విభేదాలను పేర్కొన్నారు. అయితే పోటీ కమ్యూనిస్టుపార్టీ అవలంబిస్తున్న తప్పుడు వైఖరిని ఈ సందర్భంలో మితిమీరిన రీతిలో వక్కాణించటం సరికాదని శ్రీ డాంగే అన్నారు

ప్రభుత్వం ఇంత పెద్దఎత్తున పోటీ కమ్యూనిస్టుపార్టీ నాయకులను కార్యకర్తలను అరెస్టు చేయటంద్వారా పోటీ కమ్యూనిస్టు పార్టీ వైఖరిపోని తీవ్రతకు ప్రభుత్వం అనవసరంగా ఎక్కువ ప్రాముఖ్యత యిచ్చినదని శ్రీ డాంగే అన్నారు.

దేశంలోని ప్రస్తుత సమస్యలపై పోటీ కమ్యూనిస్టుపార్టీ అవలంబిస్తున్న వైఖరి పూర్తిగా పొరపాటు ఈ వైఖరి భారత దేశంలో కమ్యూనిస్టు లక్ష్యానికి ఏ విధంగాను తోడ్పడేది కాదు అయితే పోటీపార్టీవారు తమ తప్పులను గ్రహించి సరిదిద్దుకొని తిరిగి కమ్యూనిస్టుపార్టీలో చేరగలరని తాను ఆశిస్తున్నట్లు శ్రీ డాంగే తనప్రసంగంలోపేర్కొన్నారు

ఈ సందర్భంలోనే ఆయన సిద్ధాంత సమస్యలను కూడా ప్రస్తావించి పోటీ పార్టీకి కమ్యూనిస్టు పార్టీకి గల విభేదాలను వివరించారు.

ఇప్పుడు ప్రభుత్వం జరిపిన ఈ అరెస్టులను దేశంలోని ప్రజాస్వామిక వాదులు సవాలు చేయకపోతే ప్రభుత్వాన్ని, పాలకపక్షాన్ని వ్యతిరేకించే ప్రత్యర్థులందరిపైన ఇవే అస్త్రాన్ని ఉత్తరోత్తరా ప్రయోగించే ప్రమాదం కలదని ఆయన హెచ్చరించారు

చైనా కమ్యూనిస్టు పార్టీ అవలంబిస్తున్న వైఖరిని కూడా శ్రీ డాంగే తన ప్రసంగంలో విమర్శించారు. భారత దేశంలోని పరిస్థితిని గురించి చైనా కమ్యూనిస్టుపార్టీ వేసిన అంచనా పూర్తిగా తప్పుడు అంచనా అని, ఈ విషయంలో భారత కమ్యూనిస్టు పార్టీ వేసిన అంచనాతో ప్రపంచ కమ్యూనిస్టు పార్టీలలోని అత్యధిక పార్టీలు ఏకీభవిస్తున్నవని ఇందుకు నిదర్శనగా ఇటీవల బొంబాయిలో జరిగిన కమ్యూనిస్టు పార్టీ సప్తమ మహాసభకు 24 సోదర పార్టీలు తమ ప్రతినిధులను పంపించడాన్ని తీసుకోవచ్చునని శ్రీ డాంగే వివరించారు

భారత కమ్యూనిస్టు పార్టీ దేశ భద్రతను దేశ ప్రాదేశిక సమగ్రతను రక్షించాలని కోరుతున్నదని చెబుతూ శ్రీ డాంగే యింకా ఇలా అన్నారు :

దేశ రక్షణ అంటే అర్థం పాలకపక్షమైన కాంగ్రెసును దాని ప్రభుత్వాన్ని దాని పెట్టుబడిదారీ అనుకూల విధానాలను కాపాడడం ఎంత మాత్రం కాదని మేము స్పష్టం చేయదలచాము అని శ్రీ డాంగే అనగానే సభలో మిన్నుముట్టే హర్షధ్వానాలు చెలరేగాయి అధికారం నుంచి కాంగ్రెసు ప్రభుత్వాన్ని తొలగించడం ద్వారా కూడా దేశాన్ని బాహ్య దురాక్రమణ దాడి గురించి రక్షింపవచ్చునని శ్రీ డాంగే స్పష్టీకరించారు.

పెట్టుబడిదారీ అనుకూల ప్రజా వ్యతిరేక మంత్రులందరిని ప్రభుత్వంనుంచి తొలగించాలని ఆ శక్తులను తొలగించడం ద్వారా ప్రభుత్వ విధానాలను మార్చవచ్చునని శ్రీడాంగే తన ప్రసంగంలో పేర్కొన్నారు

కమ్యూనిస్టుపార్టీలో సభ్యులుగా చేరవలసిందని ఆయన విజ్ఞప్తి చేశారు కమ్యూనిస్టు పార్టీలో చేరి, పార్టీ నాయకత్వాన త్వరలో ప్రారంభం కానున్న చారిత్రాత్మక ఆహార ఆందోళనోద్యమంలో పాల్గొనవలసిందిగాకూడా ఆయన ఆహ్వానించారు

పోటీ కమ్యూనిస్టుపార్టీనాయకుల అరెస్టులకు భారత కమ్యూనిస్టుపార్టీ సంబర పడుతున్నదంటూ కొన్ని పత్రికలు రాస్తున్న వ్రాతలు హాస్యాస్పదమైనవని ఆయన విమర్శించారు పోటీ కమ్యూనిస్టుపార్టీకి భారత కమ్యూనిస్టు పార్టీకి సిద్ధాంత సమస్యలపై తీవ్రమైన విభేదాలున్నప్పటికి భారత ప్రభుత్వం పోటీపార్టీ విషయంలో దట్ట విరుద్ధంగా ప్రజాస్వామ్య సూత్రాలకు వ్యతిరేకంగా అవలంబించిన చర్యను జరిపిన అరెస్టులను భారత కమ్యూనిస్టుపార్టీ ఎలుగెత్తి ఖండించక మానదని శ్రీ డాంగే స్పష్టం చేశారు.

కమ్యూనిస్టుల మధ్యగల విభేదాలను అవకాశంగా తీసుకొని ప్రజాస్వామిక శక్తులమధ్య గండికొట్ట జూస్తున్న దోపిడీ వర్గాల ఆటలను కొనసాగ నివ్వబోమని వారి కలలు కల్లలుకాక తప్పవని శ్రీ డాంగే ఉద్ఘాటిస్తూ తనప్రసంగాన్ని ముగించారు.

గుంటూరు రైలు బ్రాంచీ ముఠాకార్మిక సమ్మె విరమణ

గుంటూరు జనవరి 8

ఈ నెల 2 వ తేదీ నుండి గుంటూరులో గల 40 రైల్ బ్రాంచీలలో పనిచేయుచున్న ముఠా కార్మికులందరూ తమ హమాలీ రేట్లు పెంపుదలకై సమ్మె చేశారు కూలి పెంచినందున 7వ తేదీన పనులలోకి వెళ్లారు

విజయవంత మొనర్చుటకు పట్టుబడి ముఠాలు ఇతర ముఠాలు పూర్తిగాసహకరించారు 6 వ తేదీ రాత్రి రైల్ డీలర్స్ అసోసియేషన్ ఆఫీసులో యజమానుల ప్రతినిధులకు కార్మిక సంఘ ప్రతినిధులకు సంప్రదింపులు జరిగినవి. యజమానులు నేడిస్తున్న కూలీరేటుపై రూపాయి 1కి 25 న. పై. లు పెంచుటకు అంగీకరించిన ఫలితంగా 7 వ తేదీ నుండి సమ్మె విరమించబడింది. కార్మికనాయకులు స్థానిక శాసన సభ్యులు శ్రీ కనపర్తి నాగయ్య, పట్నం ముఠా కార్మిక సంఘ కార్యదర్శి శ్రీ జి వి కృష్ణారావు బ్రాంచీ ముఠాల కార్మిక సంఘ నాయకులు శ్రీయుతులు పాసినేడి వీరరాఘవయ్య షేక్ బికారి పట్టం గురునాథం, రంగిశెట్టి నాగయ్య కార్మిక సంఘ ప్రతినిధులుగా సంప్రతింపుల్లో పాల్గొన్నారు.

6 వ తేదీ రాత్రి సంప్రతింపుల అనంతరం జరిగిన ముఠా కార్మికుల సమావేశంలో యజమానులతో జరిగిన సంప్రతింపులను, నిర్ణయాలను శ్రీ నాగయ్య వివరించారు

శ్రీ జి. వి. కృష్ణారావు కూడ ప్రసంగించారు

7 వ తేదీ నుండి ముఠా కార్మికులందరూ సమ్మెను విరమించి పనులలో ప్రవేశించారు.

సాలూరుమునిసిపల్ స్కావెంజర్స్ నిరసన సమ్మె

సాలూరు, జనవరి 9

తమ కోర్కెలు న్యాయమైనవి అయినప్పటికి పరిష్కరించుటలో మునిసిపల్ స్పెషల్ ఆఫీసరు ఎటువంటి శ్రద్ధవహించనందున డిసెంబరుమాసం జీతములు తీసుకొనకుండ శ్రీకాకుళంజిల్లా సాలూరు మునిసిపల్ స్కావెంజర్స్ నిరాకరించారు 6 వ తేదీన పూర్తిగా సమ్మె చేశారు

ఈ సమ్మెకు 6 కారణాలున్నవి.

(1)క్రొత్తగా మంజూరు అయిన డి.ఎ. ఎలవెన్సులు బొబ్బిలి పార్వతీపురంమునిసిపాలిటీల్లో అక్టోబరునుంచి యిస్తున్నప్పటికీ ఈ మునిసిపాలిటీ ఇంతవరకు ఇచ్చుటలేదు ఎలవెన్స్ వెంటనే (2)మంజూరుచేయవలెనని, దరిదాపు రెండు సంవత్సరములు కావస్తున్నా మగవారికి డ్రస్సులు యిచ్చుటలేదని (3) పండుగులకు అడ్వాన్సులు యివ్వవలెనని, (4) ప్రతి చిన్న విషయానికి విపరీతమైన ఫైన్లు వేస్తున్నారు 5) చిరకాలముగాస్కావెంజరు పనిలో వున్న స్త్రీలను తీసివేశారు, మరల అచ్చట ఒక స్త్రీలు పెట్టవలెననునవి ఆ కోర్కెలు

సంక్రాంతిలోగా ఈ సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు చెప్పినందున 8 వ తేదీన పనివారు పనిలోకి వెళ్ళారు

చల్లపల్లి ఏరియా చెరకు రైతులకు విజ్ఞప్తి

మోపిదేవి, జనవరి 9

కృష్ణాజిల్లా చల్లపల్లి షుగర్స్ లిమిటెడ్ వారు రాజకీయ వివక్షతతో ఫ్యాక్టరీ ఏరియాలోని రిజిష్టర్డు చెరకు ఉత్పత్తిదార్లు అయిన రైతులని వారు లోగడ అపరు అగ్రిమెంట్లు ఇచ్చివున్నప్పటికీ ఇంతవరకు రీడింగ్ లు తీయటంగాని రీడింగ్ వచ్చినా రాలేదని చెప్పి కటింగ్ పర్మిట్లు యివ్వకపోవటంగానీ జరుగుతోంది అలాంటివారు తమ భూముల సర్వేనెంబర్లు వాటి రేడీ చెరకు నెంబరు వివరములతో 'పిటిషన్‌లు షుగర్ కేన్ ఇన్‌స్పెక్టరు-వుయ్యూరు' వారికిన్నీ, అదే నకలు "డైరెక్టర్ ఆఫ్ ఎగ్రికల్చర్-హైదరాబాద్' వారికి ఫ్యాక్టరీ మేనేజి మెంటువారికి పంపవలెను ఒక కాపీ దివితాలూకా చెరకు ఉత్పత్తిదార్ల సంఘం మోపిదేవి అడ్రస్ కి కూడ పంప వలెనని శ్రీ కంఠంనేని అచ్యుతరామయ్యగారు రైతులను కోరుతున్నారు.

కలకత్తాలో హరికథ పితామహుని శతజయంతి

కలకత్తా జనవరి 9

కలకత్తా ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు బహుభాషావేత్త సంగీత సాహితీ విశారద, హరికథా పితామహ శ్రీ మదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసుగారి శతజయంతిని 8 వ తేదీని జరిపారు సభకు పరిషత్తు అధ్యక్షులు శ్రీ వేదాంతం సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు

కార్యదర్శి శ్రీ ఆజ్జరపు ప్రభాకరరావు తాను రచించిన పరిశోధక వ్యాసమును చదివారు పిమ్మట శ్రీయుతులు జగన్నాథ్ వేదాంతం సుబ్రహ్మణ్యం డి. వి రమణమూర్తి మాట్లాడారు. శ్రీయుతులు జవటూరి మల్లికార్జునరావు గట్టి రాధాకృష్ణమూర్తి ఏ జగన్నాథరావులు నారాయణదాస విరచిత గ్రంథములనుండి కొన్ని కొన్ని భాగాలను చదివినారు సహాయ కార్యదర్శి శ్రీ అహోబలరావు వందన సమర్పణ చేశారు

700 రిపబ్లికన్ పార్టీ సత్యాగ్రహ ఖైదీల ఉపవాస దీక్ష: బండారా జైలులో

నాగపూర్ జనవరి 10

బండారా జైలులోవున్న సుమారు ఏడు వందలమంది రిపబ్లికన్‌పార్టీ సత్యాగ్రహ ఖైదీలు నిన్నటినుండి నిరాహారదీక్ష ప్రారంభించారు జైలులో ఆహారమూ వైద్యమూ అధ్వాన్నంగా ఉన్నందుకు నిరసనగా వీరు నిరాహార వ్రతానికి పూనుకున్నారు ఇంతకన్నా మంచి ఆహారం ఇవ్వాలనీ, తగిన వైద్య సౌకర్యాలు కలిగించాలనీ వీరు డిమాండ్ చేస్తున్నారు.

పరిస్థితులు మెరుగయేంతవరకు ఈ నిరాహార దీక్ష గొనసాగుతుందని, ఇక్కడి రిపబ్లికన్‌పార్టీ కార్యాలయాధికారి ప్రకటించారు.

భూటాన్ రాజు అస్వస్థత

కలకత్తా, జనవరి 10

ప్రస్తుతం కలకత్తాలోవున్న భూటాన్ రాజుకి అస్వస్థతచేసింది. అందుచేత మొదట ఏర్పాటు చేసుకున్న ప్రకారం ప్రధాని శాస్త్రిని కలుసుకోడానికి ఆయన ఈనెల 12వ తేదీన ఒరిస్సా సముద్రతీరంలోని గోపాల్‌పూర్ వెళ్ళలేని స్థితిలో ఉన్నారని నేడొకప్రకటన వెలువడింది

ఇది తెలిసి ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి దుర్గాపూర్‌నుండి రేపు కలకత్తావచ్చి భూటాన్ రాజును కలుసుకోడానికి నిశ్చయించుకున్నారు.

భూటాన్ రాజుతో మాట్లాడిన తరువాత మంగళవారం (12 వ తేదీ) నాడు ఆయన ఢిల్లీవెళ్తారు

కోయంబత్తూరులో స్వర్ణకారుల ఉపవాసదీక్ష

కోయంబత్తూరు జనవరి 10

బంగారు కంట్రోలు ఉత్తరువుకు నిరసన సూచకంగానూ తక్షణ సహాయాన్ని కోరుతూనూ పద్దెనిమిదిమంది స్వర్ణకారులు నేడు కోయంబత్తూరులో ప్రభుత్వ కార్యాలయాల ఎదుట పన్నెండుగంటల నిరాహారదీక్ష ప్రారంభించారు. వీరిలో పదిమంది కలక్టరు కార్యాలయం ఎదుట నిరాహారదీక్ష జరుపుతున్నారు.

విజయవాడలో బ్రిటిష్ ఫిల్ములప్రదర్శన

విజయవాడ జనవరి 9

ఇంటర్నేషనల్ ఫిలిం సొసైటీ ఆధ్వర్యాన గత 4 రోజులుగా స్థానిక ఫిలిం ఛాంబర్ భవనంలో బ్రిటిష్ ఫిలిం పరిశ్రమను గురించిన కొన్ని ప్రత్యేక చిత్రాలను ప్రదర్శిస్తున్నారు ఈ ప్రదర్శనలు ఈ నెల 15 వ తేదీ వరకు వుంటాయి రోజూ సాయంత్రం 6 గంటల నుండి ప్రారంభ మవుతున్నాయి

విజయనగరంలో నాయీ బ్రాహ్మణ సంఘ సభలు

విజయనగరం జనవరి 9

విజయనగరంలో జనవరి 27 28 29 తేదీలలో శ్రీ బొడ్డువారి సత్రంలో ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణసంఘ సభలు జరుగుతాయి.

విశాఖ శ్రీకాకుళం జిల్లాల ద్వితీయ మహాసభలు విజయనగరం భీమిలి శృంగవరపుకోట తాలూకా మహాసభలు కూడా యిదే కాలంలో జరుగుతున్నాయి

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ సంఘ నాయకులు శ్రీ పొన్నాడ వెంకటాద్రి, శ్రీ దాలిపర్తి శేషయ్య, శ్రీ దాలిపర్తి పిచ్చుహరి, శ్రీ వసుమర్తి రాజారావు శ్రీ రంభా వెంకటప్పయ్య (ఏలూరు మునిసిపల్ వైస్ చైర్మన్) కాంగ్రెసు నాయకులు శ్రీ మిస్సుల సూర్యనారాయణ (యం పి) శ్రీ భాట్టం శ్రీరామమూర్తి శ్రీ గంట్లాన సూర్యనారాయణ (శాసన సభ్యులు) శ్రీ అప్పసాని అప్పన్నదొర (యం యల్ సి) శ్రీ వేదుల జగన్నాథరావు గార్లు కమ్యూనిస్టు నాయకులు శ్రీ జె వి కె వల్లభరావు సోడుగువి గోవిందరావు (యం యల్ ఏ) తదితరులు హాజరవుతున్నారు

ఈ మూడురోజులు వినోద కార్యక్రమాలలో శ్రీ పిఠాపురపు సత్యనారాయణ శ్రీ బెల్లపు కృష్ణమూర్తి శ్రీ ఎ. లక్ష్మణరావు యీ ముగురు మద్రాసు సినీ ఆర్టిస్టులు శ్రీ బెల్లపు సూర్యనారాయణ (క్లారినెట్ వీరు రష్యా జర్మనీ యిటలీ ఫ్రాన్సు మొదలగు దేశాల పర్యటించి సన్మానముల పొందినవారు. యింకా అనేకమంది సంగీత విద్వాంసులు, సినీ కళాకారులు పాల్గొని జరుపుతారు. (పి. పి)

ఫ్రాన్స్-ఆల్బేనియా సంబంధాలు

పారిస్ జనవరి 9

తమ ఉభయ దేశాల మధ్య దౌత్య సంబంధాలను రాయబార స్థాయికి పెంచుకొనేందుకు ఫ్రాన్స్, ఆల్బేనియా దేశాల మధ్య నేడు అంగీకారం కుదిరింది ఈ అంగీకారం వెంటనే అమలులోకి కూడా వచ్చింది.

దుర్గాపూర్‌కు ఇందిరా గాంధి పునరాగమనం

దుర్గాపూర్ జనవరి 10

ఢిల్లీలో అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలకు ప్రారంభోత్సవం జరిపిన పిమ్మట కేంద్ర సమాచార ప్రసారశాఖ మంత్రిణి శ్రీమతి ఇందిరాగాంధి నేడిక్కడకు తిరిగి వచ్చారు.

సబార్డినేట్ కోర్టులలో ప్రబలిన అవినీతి

యు. పి. విచారణ సంఘం నివేదిక

లక్నో జనవరి 9

సబార్డినేట్ కోర్టులలో ప్రబలిన అవినీతి సాంఘిక అరిష్టంగా పరిగణించి దానిని నిర్మూలించడానికి గట్టి చర్యలు అమలు జరపాలని హైకోర్టు మాజీ న్యాయమూర్తి శ్రీ బి ముఖర్జీ తన నివేదికలో పేర్కొన్నారు.

సబార్డినేట్ కోర్టులలోజరుగుతున్న అవినీతిని గురించి దర్యాప్తు జరపడానికి యు పి. ప్రభుత్వం శ్రీ ముఖర్జీ అధ్యక్షతన ఒక సంఘాన్ని నియమించింది. ఆ సంఘం 200 పేజీల నివేదికను యు పి. రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది

ఆ నివేదికలోని ముఖ్యాంశాలు ఇవి :

సబార్డినేట్ కోర్టులపై నిత్యం తనిఖీ చేస్తూ వుండాలి అయితే ఇది కోర్టుల అధికారాలను భంగ పర్చేదిగా మాత్రం వుండరాదు

న్యాయ నిర్వహణలో అధికారుల ప్రమేయం ఒత్తిడి జాస్తిగా వున్నట్లు తేలింది.

సబార్డినేట్ కోర్టుల ఉద్యోగ సిబ్బందిజీవన స్థితిగతులను మెరుగు పర్చాలి అలా చేసిననాడు వారి నైతిక స్థాయి గణనీయంగాపెరుగుతుంది.

రిజిష్ట్రేషన్ విభాగంలో అవినీతి ప్రబలరూపం దాల్చింది సబ్‌రిజిష్ట్రార్లపై జిల్లా జడ్జి కంట్రోలు ఏర్పాటుచేస్తే తప్ప, ఈ అవాంఛనీయ పరిస్థితి తొలగిపోదు.

పోలీసులు జరిపే నేర పరిశోధన పద్ధతి పూర్తిగా దుర్నీతిమయంగావుంది. సబార్డినేట్ కోర్టులలో అవినీతికి ఇది ముఖ్యకారణంగా కన్పిస్తున్నది

సబార్డినేట్ కోర్టులలో అవినీతికి న్యాయవాదులదగ్గర పనిచేస్తున్న అవినీతిపరులైన గుమస్తాలు కూడా చాలావరకు బాధ్యులని ఈ అవినీతి పరులను అదుపులో పెట్టే బాధ్యత న్యాయవాదుల నెత్తిన పెట్టాలని ఆ నివేదికలో సూచించారు.

హెచ్చుకూలి కొరకు పెద్దపల్లి హమాలీల డిమాండ్

పెద్దపల్లి జనవరి 9

కరీంనగర్‌జిల్లా పెద్దపల్లిలో ఇటీవల వర్తక హమాలీల సమావేశం జరిగినది. ఆహార ధాన్యాల ధరలు పెరిగినందున హమాలీ రేటు పెంపుకై మార్కెటు కమిటీకి ఒక మెమోరాండము సమర్పించాలని తీర్మానించారు

ఆహార ధాన్యాల ధరలు విపరీతంగా పెరిగినందున పెద్దపల్లిపట్టణంలో ఒక డిపో ఏర్పాటు చేయాలని ప్రభుత్వమును కోరారు.

కరాచీలో ఇప్పటికి 250 మంది అరెస్టు

ప్రభుత్వం నియమించిన విచారణ కమిటీతో సహకరించవలదని ప్రతిపక్షాల విజ్ఞప్తి

కరాచీ జనవరి 9

అయూబ్ విజయోత్సవాల సందర్భంలో జరిగిన ఘర్షణలకు కారకులనే పేరుతో పాక్ పోలీసులు కరాచీలో ఇప్పటికి 250 మందిని అరెస్టు చేశారు.

ఘర్షణలకు కారకులయిన సంఘ వ్యతిరేక శక్తుల్ని తొలుత అరెస్టు చేస్తున్నామని అధికారులు ప్రకటించారు ఈ ఘటనలపై విచారణజరపడానికిముగ్గురు సభ్యులుగల కమిటీ నియామకంపై ప్రతిపక్షాలు తీవ్రమయిన విమర్శ చేస్తున్నాయి కేవలం ప్రభుత్వ అధికార్లతో నిండిన ఈ కమిటీతో సహకరించవలదని ప్రతిపక్షాలు దేశప్రజానీకానికి విజ్ఞప్తి చేశాయి

తాము కోరినట్లు హైకోర్టు న్యాయమూర్తి అధ్యక్షతన విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశాయి

చేసిన పాపాలను కప్పిపుచ్చుకోవడానికే అధికార్లతో ఈ కమిటీని నియమించారని ప్రతిపక్షాలు విమర్శించాయి

పాపాలన్నింటికీ కారణమయిన కరాచీపాలక వర్గాల్ని ఈకమిటీపల్లెత్తుమాట అనగలదా అని ప్రతిపక్షం విడుదల చేసిన ప్రకటనలో ప్రశ్నించారు.

ప్రభుత్వ అనుకూల పత్రిక మార్నింగ్ న్యూస్ తన సంపాదకీయంలో ప్రజల కోర్కెను గవర్నర్ మన్నించి ప్రస్తుతం నియమించిన కమిటీలో మరో నల్గురు న్యాయమూర్తులను చేర్చాలని కోరింది

కరాచీలో జరిగిన ఈ దుర్ఘటనలు పాకిస్థాన్‌కు మాయనిమచ్చను తెచ్చి పెట్టాయని కేంద్ర సమాచారశాఖ మంత్రి అన్నారు.

గవర్నర్ నియమించిన కమిటీ ఘర్షణలకు కారణం ఏమిటో త్వరలో తేలుస్తుందని నేరస్తులను వెంటనే ప్రభుత్వం అరెస్టుచేసి శిక్షించుతుందని ఆయన అన్నారు

జెక్ ప్రధాని భారత పర్యటన

న్యూఢిల్లీ జనవరి 9

జెకోస్లోవేకియా ప్రధాని జోసెఫ్ లెనార్ట్ ఫిబ్రవరి 28 వ తేదీనుండి మార్చి 2 వ తేదీ వరకు భారతదేశంలో అధికార పర్యటన జరుపుతారని విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రకటించింది.

ఆయనతోపాటు జెకోస్లోవేకియా విదేశాంగ మంత్రి వి. డేవిడ్ కూడా ఈ పర్యటనలో పాల్గొంటారు.

ఈ పర్యటన సందర్భంలో లెనార్ట్ ప్రధాని శాస్త్రి తదితర కేంద్రనాయకులతో సంభాషణలు జరుపుతారు.

భారతదేశంలోనివివిధ చారిత్రక సాంస్కృతిక ప్రాముఖ్యతగలప్రాంతాలను ఆయన సందర్శిస్తారు.

శాస్త్రీయ విద్యా సౌకర్యాల అభివృద్ధి ఆవశ్యకత

డి యస్. రెడ్డి ప్రసంగం

వరంగల్ జనవరి 9

కళాశాలలో శాస్త్రీయ విద్యా సౌకర్యాలను అభివృద్ధి చేయవలసిన అవసరం చాలాకలదని ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ - ఛాన్సలర్ డాక్టరు డి యస్ రెడ్డి నేడిక్కడ అన్నారు

వరంగల్ మున్సిపాలిటీ చేసిన పౌర సన్మానానికి ఆయన సమాధానం చెబుతూ క్రొత్తగా రాష్ట్రంలో కళాశాలలు నెలకొల్పేవారు అందుకు అవసరమయిన భవనాలు నిర్మించాలి. అవసరమయిన పరికరాలు ముందుగా సమకూర్చుకొని విశ్వవిద్యాలయం గుర్తింపుకు ప్రయత్నించాలని సూచించారు

నూతనంగా యేర్పడిన విశ్వవిద్యాలయం ఆధ్వర్యాన వరంగల్ ప్రాంతంలో ఒక వ్యవసాయ కళాశాలను ఏర్పరచాలనే ప్రతిపాదన గలదని ఆయన తెలిపారు

వరంగల్‌లో స్త్రీలకు ప్రత్యేకంగా ఒక కళాశాల ఏర్పాటు చేసేవిధంగా పట్టణ మునిసిపాలిటీ ప్రయత్నించాలని కోరారు

మున్సిపల్ ఛైర్మన్ శ్రీ ఎ బుచ్చయ్య సన్మాన పత్రాన్ని చదివారు.

అంతకుముందు స్థానిక వైద్యకళాశాల ఉపాధ్యాయుల విద్యార్థుల సభలో శ్రీ రెడ్డి మాట్లాడుతూ మంచి డాక్టర్లు తయారు కావడానికి అధునాతన పరికరాలు, తగు వసతులు అవసరమని అన్నారు. ఈ విషయంలో వరంగల్లు వైద్య కళాశాల మంచి అభివృద్ధిని సాధించు తున్నదని అభినందించారు.

సెలవునాడు పనికి లండన్ రేవుకార్మికుల నిరాకరణ

లండన్ జనవరి 8

వారాంతపు సెలవురోజున కూడా పని చేయమని యూనియన్ మేనేజిమెంటు చేసిన విజ్ఞప్తిని రేవు కార్మికులు తిరస్కరించటంతో లండన్ రేవులో బెర్తులమీద పని నిలిచిపోయే స్థితి ఏర్పడింది.

అత్యవసరంగా ఎగుమతులు చేయవలసివున్న దృష్ట్యా రేపుకూడా పనిచేయమని మేనేజిమెంటు కార్మికుల్ని కోరింది. గత వారం కూడా ఇలాగే సెలవునాడు మేనేజిమెంటుకార్మికుల్నిపనికిరావలసిందిగాకోరింది,

కేరళలో సచివాలయం సిబ్బంది 'నిరసనవారం'

తిరువనంతపురం జనవరి 9

తాత్కాలిక భృతిని ప్రకటించడంలోను వేతన సంఘాన్ని నియమించటంలోను జరిగే ఆలస్యానికి తమ నిరసనను తెలిపేందుకు జనవరి 15 నుండి 22 వ తేదీ వరకు నిరసన వారం జరపాలని నిన్న కేరళ ప్రభుత్వ సచివాలయానికిచెందిన ఏడు సర్వీసు సంఘాల ప్రతినిధులు సంయుక్తంగా జరిపిన సమావేశంలో నిర్ణయించారు

ఈ ఏడు సర్వీసులకు చెందిన వారందరు ఈ ఏడు రోజులు నల్లబాడ్జీలు ధరించి ఆఫీసులకు వస్తారు జనవరి 15 మధ్యాహ్నం ఫలహార స్వీకారాన్ని విసర్జిస్తారు. విరామ సమయంలో సచివాలయ ఆవరణలోనే మౌన ప్రదర్శన జరుపుతారు.

నిరసనవారం చివరిరోజున వీరు ఒక మౌన ప్రదర్శనతో రాజభవన్‌కు వెళ్లి గవర్నరుకు ఒక మెమోరాండాన్ని సమర్పిస్తారు

ప్రభుత్వ సచివాలయంలో సుమారు 3 వేల మంది ఉద్యోగులున్నారు

భారత్ సంస్థలకు ఫోర్డ్ గ్రాంట్లు

న్యూయార్క్ జనవరి 9

భారతదేశానికి 7 లక్షల 40 వేల డాలర్ల గ్రాంటులను ఫోర్డు ఫౌండేషన్ నేడు మంజూరు చేసింది.

ఎంప్లాయిమెంట్ సర్వీస్ రిసర్చి స్టాఫ్ ట్రయినింగ్ ఇన్‌స్టిట్యూట్ స్థాపనకు సహాయం నిమిత్తమై కేంద్ర కార్మిక శాఖకు 2 లక్షల 95 వేల డాలర్లు, పరిశోధన కార్యక్రమాలకై శ్రీరామ్ సెంటరుకు 2 లక్షల ఢిల్లీలోని 5 వేల డాలర్లు తక్కువ ధర ఇళ్ళ నిర్మాణంపై పరిశోధనలు జరిపేందుకుకలకత్తా మెట్రోపాలిటన్ ఆర్గనైజేషన్‌కు 2 లక్షల 40 వేల డాలర్ల గ్రాంట్లు మంజూరుచేయటం జరిగింది.

డి. యమ్. కె. హిందీ వ్యతిరేక ఆందోళన

మద్రాసు జనవరి 9

హిందీని రిపబ్లిక్ దినోత్సవం నాటినుండి అధికారభాషగా అమలుజరపటానికి ప్రభుత్వం నిర్ణయించినందువల్ల ఆరోజు 'విచారదినం'గా పరిగణించి ద్రవిడ మున్నేత్ర కజగం ప్రదర్శనలు జరుపుతుందని ఆ పార్టీ నాయకుడు శ్రీ అన్నాదురై నేడిక్కడ ప్రకటించారు

తమ పార్టీ హిందీని అధికారభాషగా చేయరాదని 1938 నవంబరు నుండి ఆందోళన జరుపుతున్నదని పి. టి ఐ. విలేకరితో మాట్లాడుతూ తెలిపారు

జనవరి 26 (1965) నుండి హిందీని అధికారభాషగా అమలు జరుపుటకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది

హిందీకి వ్యతిరేకంగా తాము జరిపే ఆందోళనలో అధికార భాషకు సంబంధించి రాజ్యాంగంలో గల భాగాలను తగలబెట్టే కార్యక్రమం మద్రాసు రాష్ట్రంలోని మరో రెండు జిల్లాలకు విస్తరించటం జరుగుతుందని తరువాత డి. ఎమ్ కె పార్టీ కార్యవర్గం సమావేశమయి ఇప్పటివరకు పార్టీ జరిపిన ఆందోళన గురించి సమీక్షించి భవిష్యత్ కార్యక్రమం రూపొందించటం జరుగుతుందని చెప్పారు

రాజాజీ వ్యాఖ్య

హిందీని అధికార భాషగా అమలు జరపటానిక్ప్రభుత్వంనిర్ణయించినకారణంగా రిపబ్లిక్ దినోత్సవమైన జనవరి 26 రోజును 'విచార దినం'గా పరిగణించాలని ద్రవిడమున్నేట్ర కజగం నిర్ణయించటంసక్రమంగాదని స్వతంత్ర పార్టీనాయకుడు శ్రీ రాజగోపాలాచారి ఇక్కడ పత్రికా విలేకరులతో మాట్లాడుతూ అన్నారు

జనవరి 16 నుండి హిందీని అధికార భాషగా అమలు జరుపుతున్నందుకు ఆరోజును 'విచారదినంగా'గా పరిగణించి, మద్రాసు రాష్ట్రమంతటా నిరసన సభలు జరపటానికి డి. యం. కె నిన్న నిర్ణయించింది

స్వతంత్రపార్టీ ఈవిషయంలో డి ఎం కె పార్టీకి మద్దతునిస్తుందా అని విలేకరులు వీరిని అడగగా, తనతో సంప్రదించి వారు ఈ నిర్ణయాన్ని చేయలేదని రాజాజీ అన్నారు

హిందీని అధికార భాషగా అమలు జరపటం దక్షిణ రాష్ట్రాల ప్రజలకు హానికరం అని అన్నారు

అయితే ఉద్దేశాలు ఒకటయినంత మాత్రం చేత సరిపోదని వానిని సాధించటానికి అనుసరించే పద్ధతులు కూడా సక్రమమైనవై వుండాలని రాజాజీ అన్నారు.

దుర్గాపూర్ జనవరి 9

మూడు రోజులుగా జరుగుతున్న కాంగ్రెస్ మహాసభ విషయ నిర్ణాయక సంఘం సమావేశం ఈ రోజు మధ్యాహ్నం 1 గంటతో పూర్తయ్యింది.

ఇండొనీషియా

(1వ పేజీ తరువాయి)

లేదా చైనాకు ఈ నిర్ణయంతో ఎటువంటి సంబంధమూ లేదని సోకర్నో స్పష్టంచేశారు

మేము గుర్తించనిమలేషియా ఐరాస లోని ఒక ఉన్నత సంస్థలో ఉండటాన్ని మేము సహించలేము ఇండొనీషియా ఐరాస ప్రణాళికను సంపూర్తిగా గౌరవించుతుంది. ప్రేమిస్తుంది అని ఆయన అన్నారు

మలేషియా వివాదం విషయంలో ఐరాస ప్రధాన కార్యదర్శి యూథాంట్ తీసుకున్న చర్యలు మాకు అసంతృప్తిని కలిగించాయి " అని ఆయన చెప్పారు.

జకార్తా నిష్క్రమణ 'ఆఫ్రికా ఆసియా సంఘీభావాన్ని పటిష్టం చేస్తుంద'ట

జకార్తా జనవరి 9

ఐరాస నుండి ఇండొనీషియా ఉపసంహరణ ఆఫ్రికా ఆసియాదేశాల మధ్య సంఘీభావాన్ని పటిష్టం చేస్తుందనీ, ఐరాస పునర్వ్యవస్థీకరణకు తోడ్పడుతుందని ఇండొనీషియా సమాచార మంత్రిత్వశాఖ గత రాత్రి ఒక ప్రకటన చేసింది

ఐరాస తన స్వంత నిబంధనావళినే భగ్నపరుస్తున్నందుకు నిరసనగా ఈ ఉపసంహరణ జరిగిందని ఆ ప్రకటన పేర్కొన్నది.

కొంతకాలంగా ఐరాస అనుచితంగా ప్రవర్తించిందనీ, ప్రపంచ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందనికూడా ఈ ప్రకటన చెప్పింది

ఈ ప్రపంచ సంస్థ సామ్రాజ్యవాదులకు ఉపకరిస్తున్న విషయాన్ని మలేషియాకు భద్రతా సంఘంలో సభ్యత్వమివ్వడం రుజువు చేస్తున్నదనీ దీని అర్థం మలేషియా సమస్య చివరకు ప్రపంచ యుద్ధంగా పరిణమించడమేననీ ఈ ప్రకటన తెలిపింది.

ఐరాస సంస్థకు పోలీసు కాపలా

జకార్తాలోని ఐరాస సాంకేతిక సహాయ బోర్డు కేంద్ర కార్యాలయానికి వెళ్ళే త్రోవలో ఇండొనీషియా పోలీసులు కాపలాగా నిల్చున్నారు ఈ కేంద్రంలో పని చేస్తున్న ఉద్యోగులకు ఈ కాపలా విస్మయం కలిగించింది అయితే సీనియర్ ఉద్యోగులుమాత్రం ఇక్కడి నుండి తరలి వెళ్ళడానికి సన్నాహాలు సాగిస్తున్నారు వీరు దీని విషయమై ఎట్టి ప్రకటనా చేయలేదు.

పరిశీలకుల వ్యాఖ్య

గతంలో నూతన దేశాలతో కూడిన మహా సభలను సంస్థలను ఏర్పాటు చేయడంలో ఇండొనీషియా చొరవ తీసుకున్నదని, కాగా ప్రస్తుతం ఐరాసకు పోటీ సంస్థను నెలకొల్పడానికి ఈ దేశం సన్నాహం చేయగలదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

సుబాండ్రియో ప్రకటన

పశ్చిమ ఇరియన్‌తో ఐరాసకు ఎట్టి ప్రమేయము లేదని పశ్చిమ ఇరియన్ సమస్యపై తాము హాలెండుతో ద్విపక్ష ఒప్పందంమాత్రమే చేసుకున్నామని ఇండొనీషియా విదేశాంగ మంత్రి సుబాండ్రియో నేడిక్కడ పత్రికా విలేకరులతో మాట్లాడుతూ అన్నారు ఇరియన్ ప్రజానీకం ఇండొనీషియాలో ఉండాలా లేదా అని నిర్ణయించుకొనేందుకు జనవాక్య సేకరణ జరపాలన్న కోర్కెలను ప్రస్తుతం ఇండొనీషియా అంగీకరించకుండా ఉండడానికి ఐరాస నుండి ఉపసంహరణ ఉపకరించిందని ఇండొనీషియా వార్తాపత్రికలు రాశాయి

పారిస్‌లోని ప్రపంచ మాజీ సైనికుల ఫెడరేషన్ సభ్యత్వం నుండి ఇండొనీషియా ఉపసంహరించుకు టున్నదనితెలుపుతూ ఇండొనీషియా మాజీ సైనికుల వ్యవహారాల మంత్రి ఒక తంతి పంపారని అంటారా వార్తాసంస్థ నేడు ప్రకటించింది.

చైనా పత్రికల ప్రశంసలు

ఐరాసనుండి ఇండొనీషియా ఉపసంహరణ ధర్మసమ్మతమైన చర్యఅని చైనాలోని ప్రముఖ వార్తాపత్రిక 'టాకుంగ్‌పావో' నేడు ప్రశంసించింది సామ్రాజ్యవాద శక్తుల అవమానాలనూ బెదిరింపులనూ ప్రతిఘటించడంలో ఇది సాహసోపేతమైన చర్యఅనికూడా ఆ పత్రిక రాసింది.

ఇండొనీషియా గెరిల్లాల అరెస్టు

మలేషియా వర్గాల కథనం

కౌలాలంపూర్ జనవరి 9

మలేషియా భద్రతా దళాలు నేడు 30మంది ఇండొనీషియాగెరిల్లాలను పట్టుకున్నట్లుప్రకటించారు వీరినిదక్షిణమలయా ద్వీపకల్పంతీరంలో మూడుపార్లు సాగిన దాడుల సందర్భంలో పట్టుకున్నట్లు వారు తెలిపారు

కోటటింగీ ప్రాంతంలో జోహోర్ రాష్ట్ర తూర్పు ప్రాంతంలో 12 మంది ఇండొనీషియా గెరిల్లాలను అరెస్టుచేసినట్లు పోలీసులు ఇక్కడ దృవీకరించారు ఈగెరిల్లాలు నేడు ఈ తీరానికి చేరినట్లు సింగపూర్ వార్తలు చెపుతున్నాయి అయితే కొన్ని వారాలక్రితమే వీరు ఈతీరం చేరారని అప్పటినుండి దాపునవున్న అడవుల్లో దాగివున్నారనీ కొన్నివర్గాలవారు చెబుతున్నారు

ఈద్వీప కల్పానికి ఆవలివైపు ప్రాంతంలో టాన్‌జోంగ్ పాయ్‌వద్ద నిన్న దిగిన 24 మంది గెరిల్లా దళంలో 8 మందిని అరెస్టు చేసినట్లు కూడా చెపుతున్నారు ఈ ప్రాంతంలో ఇప్పటికి మొత్తం 13 మంది ఇండొనీషియా గెరిల్లాలను నిర్బంధించారట.

మలయా - సుమిత్రాలమధ్య ఒక ఇండొనీషియా టగ్‌బోటుపై మలేషియా గస్తీ నౌక కాల్పులు జరిపి ముంచివేసిందని నీటిలో పడిపోయిన వారినుండి 12 మంది ఇండొనీషియావారిని పట్టుకున్నట్లు నేడిక్కడ అధికార ప్రకటన వెలువడింది.

అయితే 16 మందిని పట్టుకొన్నారనీ దాదాపు 24 మంది టగ్ బోటుతోపాటు మునిగిపోయివుంటారని విశ్వసనీయ వర్గాలవారు చెబుతున్నారు

మలేషియా ప్రధాని టుంకూనేడు టాంజోంగ్ పాయి ప్రాంతంలో పర్యటించారు ఇండొనీషియా గెరిల్లాలు దండం తుపాకీ గుండ్లతో సాయుధులై వున్నారని ఆయన చెప్పారు.

24 మంది ఇండొనీషియా గెరిల్లాలు రెండు నావలలో తీరం చేరారని తర్వాత వారు గ్రూపులుగా విడిపోయారని ధృవపడని వార్తలు తెలుపుతున్నాయి

మలయా తీరంలో ముంచివేసిన ఇండొనీషియా టగ్‌బోటు గత మాసం డిసెంబర్ రేవు నుండి దొంగిలించిన ఒక బోటును లాక్కెళుతున్నట్లు కొన్ని వర్గాలవారు చెబుతున్నారు.

ఈబోటు మలేషియా గస్తీ నౌకపైకాల్పులు సాగించిందని తిరిగి దీనిపై మలేషియా నౌక 40 మిల్లీమీటర్ల మరతుపాకులతో కాల్పులు జరిపిందని చెబుతున్నారు ఈ బోటును ముంచిన మలేషియా నౌక పట్టుబడిన ఇండొనీషియా గెరిల్లాలతో తీరంచేరినప్పుడు కాల్పుల గుర్తులు ఆ నౌకమీద ఉన్నాయని అన్నారు పట్టుబడిన ఇండొనీషియా గెరిల్లాలలో ఇద్దరిని స్ట్రెచర్ మీద మోసుకెళ్ళారని కూడా వీరు తెలుపుతున్నారు.

ఇండొనీషియాకు అమెరికా సహాయ పథకాల నిలిపివేత

ఐరాసనుండి ఉపసంహరణకు ప్రతీకారం

వాషింగ్టన్ జనవరి 9

ఇండొనీషియా ఐరాస నుండి ఉపసంహరించుకున్నందుకు ప్రతీకారంగా ఆ దేశానికిచ్చే తమసహాయ కార్యక్రమాలలో గణనీయమైన కోత పెట్టాలని అమెరికా ప్రభుత్వం నిర్ణయించినట్లు నేడిక్కడ తెలియవచ్చింది

అయితే అమెరికా ప్రభుత్వం అధికార రీత్యా ఈ వ్యవహారం గురించి బహిరంగంగా ఎలాంటి వ్యాఖ్య చేయలేదు

వర్తమాన ఆర్థిక సంవత్సరంలో ఇండొనీషియాకు అమెరికానుండి ఒకకోటి 50 లక్షల డాలర్ల మొత్తం వివిధ సహాయపథకాలక్రింద లభించవలసి వుంది.

ఈసారి ఎ. ఐ. సి. సి సమావేశం

శ్రీనగర్‌లో జరపాలని సాదిక్ ఆహ్వానం

దుర్గాపూర్ జనవరి 9

ఈసారి జరిపే అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సమావేశం శ్రీనగర్‌లో జరపవలసి దని కాశ్మీర్ ప్రధాని శ్రీ జి యమ్.సాదిక్ నేడు కాంగ్రెస్‌ను ఆహ్వానించారు

శ్రీ సాదిక్ విషయనిర్ణయ సభలో ప్రసంగిస్తూ తన వినయపూర్వక ఆహ్వానాన్ని కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ కామరాజ్ అంగీకరించగలరని ఆశిస్తున్నానని అన్నారు

గోవా ఉత్తర ప్రదేశ్ లు కూడా ఈసారి జరిగే ఏ ఐ సి సి సమావేశాన్ని తమ రాష్ట్రాలలో జరపవలసిందిగా ఆహ్వానించాయి

ఇండొనీషియాచే కొత్త ఐరాస ?

జకార్తా, జనవరి 9

ఐరాసకు పోటీగా మరొక ప్రపంచసంస్థను ఏర్పాటు చేయాలని ఇండొనీషియా ఉద్దేశిస్తున్నట్లు నేడిక్కడ సూచించటం జరిగింది

ఇండొనీషియా సమాచార మంత్రిత్వశాఖ నేడిక్కడ ఒక ప్రకటనలో ఐరాస నుండి ఇండొనీషియా నిష్క్రమణానంతరం కొత్త రకం ఐక్యరాజ్య సంస్థను ఏర్పాటు చేస్తుందని తెలిపింది.

ఇంతకుమించి దీని ఏర్పాటు విషయమై అదనంగా వివరాలు ఇవ్వలేదు కాని ఆఫ్రికా ఆసియా దేశాల సంఘీభావాన్ని పటిష్టం చేయవలసిన ఆవశ్యకత గురించి ఈ ప్రకటన వక్కాణించింది

మలయాలోకి మరో ఇండొనీషియా దళం

మలేషియా వర్గాల కథనం

సింగపూర్ జనవరి 9

ఈరోజు మరొక ఇండొనీషియా సైనిక దళం దక్షిణ మలయాలో దిగిందని నేడిక్కడ విశ్వసనీయవర్గాలవారన్నారు వీరిలో 12 మందిని పట్టుకున్నట్లు ధృవపడని వార్తల ద్వారా తెలుస్తున్నది

దక్షిణ మలయాలోని కొటటింగీ జిల్లాలో ఇండొనీషియా సైనికులు దిగినట్లు ఈ వార్తలు తెలుపుతున్నాయి ఇలా దిగినవారి సంఖ్య ఎంతయినదీ తెలియటంలేదు

మలయా తీరాన్ని చేరడానికని పడవలో వస్తున్న నలుగురు ఇండొనీషియన్లనుమలేషియా గస్తీనౌక అడ్డగించిపట్టుకున్నదని అధికారులు అన్నారు

అంతకుముందు తీరం చేరిన 14 గురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు వీరిని తీరగ్రామస్తులు వెంబడించి పట్టుకొన్నారనీ ఇంకో 1000 మంది ఇండొనీషియన్లు వస్తున్నట్లు పట్టుబడ్డవారు తెలిపారని పోలీసులు అన్నారు

ఆయుధాలతో వస్తున్న ఇండొనీషియా మోటారుబోటును తీరప్రాంతంలో పట్టుకున్నట్లు అధికారవర్గాలవారన్నారు.

13 అరబ్ దేశాల శిఖరాగ్రసభ కైరోలో ప్రారంభం

కైరో జనవరి 9

అరబ్ రాజ్యాల శిఖరాగ్ర సభ నేడిక్కడ ప్రారంభమయ్యింది గత సమావేశం అనంతరం అరబ్ దేశాల మధ్యగల సంబంధాలు మరింత బలపడి కొన్ని సత్ఫలితాల నిచ్చాయని అరబ్‌లీగ్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హస్సానీ తెలిపారు

ఈ సమావేశంలో 13 దేశాల ప్రధానులుగానీ డిప్యూటీ ప్రధానులుగానీ పాల్గొంటున్నారు

సిరియా ఉప ప్రధాని నూరుద్దీన్ సమావేశానికి అధ్యక్షత వహించారు

జోర్డాన్ నదీజలాలను మళ్ళించే కార్యక్రమాన్ని త్వరగా అమలుజరపాలని ఐక్య అరబ్ ఉపాధ్యక్షుడు అన్నారు

దక్షిణ అరేబియా జాతీయ విముక్తి ఉద్యమాన్ని అణచడానికి ఆయుధాలు తీసుకుపోయే విమానాలు తమ దేశంలోని విమానాశ్రయాలలో దిగరాదనే ఆంక్ష తమ దేశ ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించుతున్నదని సూడాన్ ప్రధాని ఖలీఫా అన్నారు

అరబ్ ఉమ్మడి మార్కెటును అభివృద్ధి చేయాలని ఆయన కోరారు.

35 నిముషాలు బహిరంగ సమావేశం జరిగిన అనంతరం, ఆంతరంగిక సమావేశం ప్రారంభమయ్యింది

గత సెప్టెంబరులో అలెగ్జాండ్రియాలో అరబ్ దేశాల అధిపతులు అధ్యక్షులు సమావేశమై చేసిన నిర్ణయాలను అమలు జరపటంలో సాధించిన అభివృద్ధిని గురించి అరబ్ నాయకులు చర్చించనున్నారు.

అరబ్ నాయకులు ముందు 16 అంశాలతో కూడిన ఎజెండావున్నది ఈ అంశాలలో అరబ్ దేశాల ఉమ్మడి సైన్యం, దానికి సంబంధించిన విషయాలు కూడావున్నవి ఆంతరంగిక సమావేశంలో ఛీఫ్ కమాండర్ అలి అమర్ నివేదికను సమర్పించనున్నారు

సోవియట్ రాకెట్ పరీక్షలు

పసిఫిక్‌లో నౌకలకు హెచ్చరిక

మాస్కో జనవరి 9

పసిఫిక్ సముద్రంలోకి సోమవారంనుండి మార్చి 1 వ తేదీవరకు కొత్తరకం రాకెట్లను రష్యాప్రయోగిస్తుందని టాస్‌నేడుప్రకటించింది.

ఆ ప్రాంతంలో పయనించే నౌకలు ఈ విషయాన్ని గమనించాలనికూడా ముందుగా హెచ్చరించింది

ఆస్ట్రేలియా గోధుమ దిగుమతి

మెల్‌బోర్న్ జనవరి 9

రాబోవు ఐదు మాసాలలోగా 1 25,900 టన్నుల గోధుమలు ఆస్ట్రేలియానుండి భారతదేశానికి ఎగుమతి చేయటానికై ఒక ఒప్పందం కుదిరిందని దానిపై ఒక వారంరోజుల్లో సంతకాలు జరగనున్నాయని ఆస్ట్రేలియా గోధుమ కార్పొరేషన్ ఛైర్మన్ జె. వి. మెరోనీ నేడిక్కడ తెలిపారు.

గోధుమల కొనుగోలు సంప్రతింపుల నిమిత్తం భారత కేంద్ర ఆహారశాఖ కార్యదర్శి శ్రీ ఎ. ఎల్ డియాస్ ఆర్థిక సలహాదారు శ్రీ లూథర్ ఈ వారంలో ఇక్కడకువచ్చారు

వీరు ఇక్కడనుండి జనవరి 14 న భారతదేశానికి బయల్దేరి వెడతారు.

మద్రాసు ప్రభుత్వ సచివాలయం ముందు స్వర్ణకారుల ప్రదర్శన

మద్రాసు జనవరి 9

బంగారం కంట్రోల్ నిబంధనలకు నిరసనగా మద్రాసు సచివాలయం ముందు కొన్ని వందలమంది స్వర్ణకారులు నేడు ప్రదర్శన జరిపారు.

నగరవీధులగుండా మౌనంగా ప్రదర్శన జరుపుకుంటూ వచ్చిన ప్రదర్శకులు సచివాలయంముందు బైఠాయించి కూర్చున్నారు

ఈరోజు సాయంత్రం వరకు ప్రభుత్వ బంగారు కంట్రోలు నిబంధనలకు నిరసనగా లాంఛనప్రాయమయిన నిరాహార దీక్ష జరుపుతామని స్వర్ణకారుల ప్రతినిధి పత్రికలవారితో అన్నారు.

ప్రస్తుతంవున్న లైసెన్సింగ్ పద్ధతిని రద్దు చేయాలనీ ఒక్కొక్క స్వర్ణకారుని వద్ద 100 గ్రాముల కంటే ఎక్కువ బంగారం వుండరాదనే పరిమితిని రద్దుచేయాలనీ వీరు కోరుతున్నారు

పానుగంటి శత జయంతి సందర్భంగా ఆంధ్ర విశ్వసాహితి వారు జరుపుతున్న హాస్య రచన పోటీ గడువు ఫిబ్రవరి 28 వ తేదీ వరకు పొడిగించబడింది.

నిర్లక్ష్య వైఖరి

(1 వ పేజీ తరువాయి)

మూలంగా ధనికులు కాంగ్రెసు సంస్థ మీద ప్రాబల్యం వహించేటందుకు దారి ఏర్పడిందని శ్రీ త్రివేదీ అన్నారు

కాంగ్రెసు పార్టీ ఎల్లప్పుడూ తప్పులే చేస్తుంటే ప్రజలు సహించరని శ్రీ కాంతిలాల్ కొఠారీ (ఉ ప) అన్నారు భారత యువజనం జవలేనివాళ్ళనీ వారు తమవంతు కర్తవ్యాన్ని నిర్వహించే టందుకు ఉత్సహిస్తున్నారనీ వారికి సరియైన కార్యాచరణ పంథా చూపించాలనీ ఆయన అన్నారు

మ ప్ర సభ్యుడు శ్రీ దామోదర నిగమ్ ప్రసంగిస్తూ ఆహారం తదితర క్లిష్ట సమస్యలతోపాటు బంగారు కంట్రోల్సు గ్రామీణ ప్రాంతాలలో ఎంతోకష్టం తెచ్చి పెట్టాయనీ వీనితో కాంగ్రెసు వాదులపని మరింత కష్టతరం అవుతూందనీ అన్నారు

శ్రీ పి వి రామారావుగుప్త (మద్రాసు) మాట్లాడుతూ ప్రస్తుతం నిర్మాణంలోవున్న ప్రాజెక్టులన్నీ పూర్తిఅయితే దేశంలోవలసినంత తిండి వుంటుందన్నారు. కాంగ్రెసు వాదులు ఓర్పుతో ఫలితాలకోసం వేచివుండాలనీ పార్టీ తీర్మానాలు అమలుజరిపే కర్తవ్యం వారి చేతుల లోనే వున్నదనీ వారికి మార్గంచూపడానికి నాయకులు సిద్ధంగా వున్నారనీ శ్రీ గుప్త అన్నారు. పని జాప్యాన్ని సహించలేని వ్యక్తి ఈనాడు కాంగ్రెసు అధ్యక్షులుగా వున్నారని ప్రస్తుతించారు

శ్రీమతి సవితాబెన్ (పంజాబ్) ప్రసంగిస్తూ కాంగ్రెసు నిర్మాణంలో స్త్రీలపాత్ర ఏమిటో తీర్మానం వివరించడంలేదన్నారు దేశపునర్నిర్మాణంలో స్త్రీలు అధికంగా పాలొన గలిగేటట్లు ఒక కార్యక్రమం తయారు కావాలన్నారు శాసన సభలలోనూ కాంగ్రెసు నిర్మాణంలోనూ స్త్రీలకు అధికప్రాతినిధ్యం కావాలన్నారు

హరిజనులు వెనుకబడిన జాతులు ఆదివాసుల పరిస్థితులను బాగుపరచేటందుకు కాంగ్రెసువాదులు గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువ శ్రద్ధతో పని చెయ్యాలని శ్రీ రాజభోజ్ (మహారాష్ట్ర) అన్నారు సమాజంలో ధనికులమీద ఎక్కువ పన్నులు వెయ్యాలన్నారు

మహారాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ వినాయక్‌రావ్ పాటిల్ చర్చలకు సమాధానం ఇచ్చి చర్చ ముగించారు

ఉపన్యాసకులలో అధికభాగం దేశంలోని ఆర్థిక సమస్యలమీదనే ప్రసంగించారనీ ఆ సమస్యలను ఉద్దేశించి వేరొక తీర్మానం వుండనేవున్నదనీ ఆయన అన్నారు రాజకీయాలలోని అవినీతిని నిర్మూలించేటందుకు వక్తలు చేసిన సూచనల కభినందనలు తెలిపారు ఆ విషయమై హోంమంత్రి శ్రీ గుల్జారీలాల్ నందా చేస్తున్న కృషిని ప్రశంసించారు

ప్రజానీకంతో పార్టీ కార్యకర్తలు సన్నిహిత సంబంధాలు ఏర్పరచు కొనగోరుతున్న తీర్మానాన్ని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది

చర్చ సాగుతుండగా ప్రతినిధుల సంఖ్య కొద్దిగా పెరిగిందేగాని అది అంత చెప్పుకోదగింది కాదు

కమ్యూనిస్టు పార్టీని నిషేధించాలట

శ్రీ రంగా రంకెలు

హైదరాబాద్ జనవరి 8

కమ్యూనిస్టు పార్టీని పోటీ కమ్యూనిస్టు పార్టీని రెండింటినీ ప్రభుత్వం తక్షణమే నిషేధించాలని స్వతంత్ర పార్టీ అధ్యక్షులు శ్రీరంగా నేడు సెలవిచ్చారు.

ఈ పార్టీలను నిషేధించినట్లయితే వాటి సభ్యులలో అత్యధికులు ఆ పార్టీలనుండి రాజీనామా ఇచ్చి బయటకుపోతారని ఆ విధంగా బయటకు పోక ఇంకా ఆ పార్టీలలో సభ్యులుగా ఉన్నవారు దేశానికి తమ విధేయతను తెలపకపోతే వారిపై చర్య తీసుకోవాలని శ్రీ రంగాగారు సూచన చేశారు.

పోటీ కమ్యూనిస్టుపార్టీ వారిని అరెస్టు చేసినందుకు తమ ప్రభుత్వాన్ని అభినందించలేనని ఎందుచేతనంటే అది బండిముందు గుర్రం వెనుక కధలా ఉన్నదని శ్రీరంగా అన్నారు

కమ్యూనిజం ఎడల, కమ్యూనిస్టుల ఎడల ప్రభుత్వం తన వైఖరిని స్పష్ట చేయాలని అసలు అదే ప్రప్రథమ కర్తవ్యమని ఆయన అన్నారు.

పోటీపార్టీవారిని నిర్బంధంనుండి విడుదల చేయాలి

శాసనమండలి సభ్యులు శ్రీ పి శ్రీరామమూర్తి విజ్ఞప్తి

విజయవాడ జనవరి 9

పోటీ కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ సుందరయ్య మొదలు తాలూకానాయకులవరకు జరిగిన ఆకస్మిక అరెస్టులు ప్రజాస్వామ్య విరుద్ధమనీ ముఖ్యముగ కేరళలో ఎన్నికలు జరుగనున్న తరుణంలో ప్రభుత్వం వారి చర్య గతంలో కేరళ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసిన చర్యను మించినదిగా వున్నదనీ అందువల్లనే పార్లమెంటరీప్రజాస్వామ్యంలో నమ్మకమున్న మేధావులను విస్మయానికి గురిచేసిందనీ తెలుపుతూ శాసనమండలిలోని ఉపాధ్యాయ సభ్యులు శ్రీ పి. శ్రీరామమూర్తిగారొక ప్రకటన చేశారు

"అరెస్టు చేయబడినవారిపై తీవ్రమైన అభియోగమున్నదని ప్రభుత్వం భావించే పక్షంలో న్యాయస్థానాలలో వాని విచారించి శిక్షించవచ్చు. దేశ స్వాతంత్ర్యం రక్షణ అందరికీ అత్యంత ప్రీతిదాయకమైనది కాని న్యాయస్థానాలలో వీర్ని విచారించకుండా జైళ్ళలో వుంచటంద్వారా న్యాయస్థానాల్లో తమవద్దగల సాక్ష్యాధారాలలోను ప్రభుత్వానికి నమ్మకంలేదా అనే సందేహం కలుగకమానదు ఇప్పటికైనా వారిపై న్యాయస్థానాల్లో కేసులుపెట్టి విచారించాలని కోరుచున్నాను లేదా వారిని విడుదల చేయవలసి వుంది. అరెస్టు అయినవారి కుటుంబాల పోషణ బాధ్యతను ప్రభుత్వం వహించాలని ఈ సందర్భంలో కోరుచున్నాను" అని ఆయన ఆ ప్రకటనలో అన్నారు.

భారతప్రజలతోడిదే జమ్మూ - కాశ్మీర్ ప్రజ

దిక్కులేనివారమనే నిరుత్సాహం వారిలో కలిగించవలదని శ్రీ సాదిక్ విజ్ఞప్తి

దుర్గాపూర్ జనవరి 9

జమ్మూ - కాశ్మీర్‌లో కాంగ్రెస్ శాఖను నిర్మించాలనే తీర్మానం నిన్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో ఆమోదం పొందింది. (ఈ వార్తనునిన్ననే విశాలాంధ్ర యిచ్చింది)

తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ శ్రీ ఎస్ కె పాటిల్ కాంగ్రెస్ నిబంధనావళిలో సవరణ తెచ్చేటందుకు (జమ్మూ - కాశ్మీర్‌ను 19 వ కాంగ్రెసు రాష్ట్రంగా స్వీకరించేటందుకు సవరణ అవసరం) నెల నోటీసు యివ్వడం అవసరమైనా ప్రత్యేక పరిస్థితులలో" అవసరం లేదన్న నిబంధన ననుసరించి ఈ తీర్మానాన్ని తెస్తున్నానన్నారు

మాజీ కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ యన్ సంజీవరెడ్డి ప్రసంగిస్తూ 1960 61 లో తమ హయాం సాగినప్పుడే జమ్మూ - కాశ్మీర్ శాఖ స్థాపించప్రయత్నించామనీ కాని సాధ్యం కాలేదనీ, ఇప్పుడు కాంగ్రెసులో చేరడానికి జాతీయ మహాసభ నాయకులు ఏకగ్రీవంగా నిర్ణయించడం హర్షదాయకమనీ అన్నారు

కాశ్మీర్ ప్రధాని శ్రీ గులామ్ మహమ్మద్ సాదిక్ కాశ్మీర్ విషయంలో కాంగ్రెసు చేసిన నిర్ణయాన్ని అభినందిస్తూ ప్రసంగించారు

ఇకనుంచి కాంగ్రెసు జమ్మూ - కాశ్మీర్ ప్రజల భవిష్యనిర్ణేత కాగలదు ఎన్నోదశాబ్దాలుగా అక్కడి ప్రజలు కంటున్నకలలు ఫలించగలవనే ఆశిస్తున్నాను.

"ఇతఃపూర్వం కాశ్మీర్ గురించి ఎవ్వరికీ ఎక్కడ ఏ దురభిప్రాయమున్నా ఇక అది తొలగుతుంది.

'ఇప్పుడు పెద్దసంస్థ అయిన కాంగ్రెసులో ఒక భాగం అయ్యాము భారతదేశంలోని మిగతా ప్రజలందరితో చేరి చేయి కలిపి ఉమ్మడి ఆశయాలకోసం పోరాడుతాము. రాజకీయ నిర్మాణం గమ్యసాధనకొక ఉపకరణం ఇంత వరకు మా ఆర్థిక సాంఘిక సమస్యల్ని మాకు తోచిన విధంగా పరిష్కరించుకొన ప్రయత్నించాం. ఇకముందు ఆ పని కాంగ్రెసు ద్వారా చేస్తాం.

"జాతీయ మహాసభ నూతన కార్యక్రమం కాంగ్రెసు గమ్యంగా పెట్టుకొన్న సోషలిజానికి అనురూపమైనదే కాంగ్రెసు యొక్క సలహా సహాయాలతో మాగమ్యాలను సులభంగా సాధించుకోగలమని ఆశిస్తున్నాను

"1944 లో కాశ్మీర్ ప్రజ ముస్లిం లీగ్‌లో చేర నిరాకరించారు వారిని బుజ్జగించడానికి శ్రీ జిన్నా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు, 1947 లో జాతీయ మహాసభ ముస్లింలీగ్ రాయబారాలను తోసిపుచ్చి భారతదేశం తోడిదే తమ భవిష్యత్తు అనుకొంది

కాశ్మీర్ సమస్య దురదృష్టవశాత్తూ భద్రతా సంఘంముందు కెళ్ళింది. అది ఆరకుండా మధ్య మధ్య రగులుతూనే వున్నాది. కాని, కాశ్మీర్ ప్రజకు సంబంధించినంతవరకు 1947 నిర్ణయమే అమలు జరుగుతూంది. మధ్యమధ్య దానిని పునరుద్ఘాటిస్తూనేవున్నారు

ఈనాటి నిర్ణయంతో కాశ్మీర్ చరిత్రలో నూతనాధ్యాయం ఆరంభమవుతుంది. ఇంత వరకు ఎన్నో దురభిప్రాయాలుంటూ వచ్చాయి వానిని తొలగించడానికి మనం కృషిచెయ్యాలి ఒకటి గట్టిగా చెప్పగలను మా రాష్ట్ర ప్రజల మనసు మంచిది. వాళ్ళు మంచివాళ్ళు మావారి పాట్లవలన కొన్ని బాధలుపడ్డారు వానిని ఢిల్లీ సరిచెయ్యగలదను కొన్నారు కాని దురదృష్టవశాత్తూ ఢిల్లీ ఎన్నడూ వారివేపే చూడలేదు,"

కాంగ్రెసు అధ్యక్షునివేపు తిరిగి శ్రీ సాదిక్ తమ ఉపన్యాసం సాగించారు

తమ గోడు ఎవ్వరూ పట్టించుకోరనే భావం కాశ్మీరీలకు కలిగేటట్లు వ్యవహరించకండి. వారిలో ఆ నిరుత్సాహం కలిగే పరిస్థితులు గతంలో చాల పర్యాయాలు సంభవపడ్డాయి

"కేంద్ర నాయకత్వం ఇవన్నీ గమనించి కాశ్మీర్ ప్రజలకు మిగిలిన దేశంతో సమానంగా న్యాయం కలిగించాలని కోరుతున్నాను

"కాశ్మీర్ ప్రజ ముస్లిములతో సహా ఎవ్వరూ భారతదేశం విడిచి బయటకు పోగోరడం లేదు

శ్రీ సాదిక్ ఉపన్యాసం హర్షధ్వానాల మధ్య ముగిసింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కరువు భత్యంలో తేడాలు

ఏలూరు, జనవరి 8

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు దాస్ కమిషన్ నివేదికను పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం కరువు భత్యం పెంపుదలజేస్తూ ప్రకటనజేసింది. దీనివల్ల ఒకేచోట పనిజేసే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కరువుభత్యంలో ఈ క్రిందివిధంగా వ్యత్యాసం ఏర్పడింది.

(మొదట రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కరువుభత్యం తర్వాత కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కరువుభత్యం వరుసగా పేర్కొనబడినవి)

రు. 70 నుండి 109 వరకు రు 20 00- రు 28-00; రు 110 నుండి 149 వరకు రు 20-00- రు 42-00 రు 150 నుండి 209 వరకు రు 32-00 - 56 00; రు 210 నుండి 299 వరకు రు 32 00 - రు 66-00; రు 300 నుండి 399 వరకు రు 6-00 - రు 66-00; రు 400 నుండి 599 వరకు లేదు రు 70-00

రెవిన్యూశాఖలో ఉద్యోగుల హోదా తగ్గింపు

ఏలూరు, జనవరి 8

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెవిన్యూశాఖలో పనిజేసేసిబ్బందికి కనీవినీఎరుగని నిరుద్యోగం, హోదాలతగ్గింపు (రివర్షన్స్) రాష్ట్రవ్యాప్తంగా వాటిల్లింది అనేక సంవత్సరాలు కష్టించి పని జేసే ఉద్యోగికి ప్రమోషన్ ఇవ్వక పోగా ఇచ్చిన ప్రమోషన్లు రద్దు చేస్తూ రెవిన్యూ శాఖవారు ఉత్తర్వులు జారీ జేశారు, ప్రభుత్వశాఖల్లో ప్రధానమైన రెవిన్యూ శాఖలో ప్రమోషన్లు లభించడం అటుంచి వచ్చిన ప్రమోషన్లు రద్దుగావడంవల్ల ఉద్యోగులలో తీవ్రంగా అసంతృప్తి అలజడి వ్యాపిస్తోంది

ఈ విషయమై ప్రదేశ్ ఎన్ జి వో లసంఘం తరపున శ్రీ ఎ. శ్రీరాములు నాయకత్వాన రెవిన్యూ ఉద్యోగుల ప్రతినిధులు హైదరాబాద్‌లో రెవిన్యూ మంత్రిని కలుసుకొన్నారు. మంత్రులు సంతృప్తికరమైన సమాధానం ఇవ్వలేదు.

ఈ పరిస్థితిని చర్చించి కార్యక్రమాన్ని నిర్ణయించుటకుగాను రాష్ట్ర ఎన్ జి వో సంఘ కార్యవర్గ సమావేశం జనవరి 31 తేదీన విజయవాడలో జరుగుతుంది. ఇక్కడకు అందిన సమాచారాన్ని బట్టి తాసీల్దార్లుగాను డిప్యూటీ తాసీల్దార్లుగాను 15 సం" పైగా పని జేస్తున్న వారిని గూడా వారి స్థానాలనుంచి తగించి వేయబడినట్లు తెలిసింది. రాష్ట్రం మొత్తం మీద 59 మంది తాసీల్దార్లు 300మందిడిప్యూటీతాసిల్దారు522 అప్పర్‌డివిజన్‌గుమాస్తాలు వారిస్థానాలనుతగించి వేయడం జరిగింది అంతేగాకుండా524 మంది లోయర్ డివిజన్‌గుమాస్తాలు 221మంది నాల్గవ తరగతి ఉద్యోగులు నిరుద్యోగానికి పాల్పడాల్సి వచ్చింది.

ముందు చూపులేకుండా ప్రభుత్వం అవలంబించుతూన్న అవకతవక విధానాలకు ఇది ప్రబల నిదర్శనం (వి. వి.)

విజయనగరంలో లవంగాలు, దాసనచెక్క పట్టివేత

విజయనగరం జనవరి 9

విజయనగరం రైల్వేస్టేషన్‌లో జనవరి 5 వ తేదీన సెంట్రల్ ఎక్సయిజు డిపార్టుమెంటువారు ఒరిస్సారాష్ట్రానికి చెందిన బరహంపూర్ వాస్తవ్యుడు శ్రీ రాజేశ్వరపాత్రో అనే ఆసామి వద్దనుండి 366 కిలోల లవంగాలు 75 కిలోల దాసనచెక్క పట్టుకున్నారు. కొన్ని కారణాలపై ముద్దాయిని పోలీసులు విడిచిపెట్టారు. కేసు దర్యాప్తు జరుగుతున్నది. (వి. వి)

అండమాన్, నికోబార్ దీవులకు త్వరలో శ్రీకామరాజ్

దుర్గాపూర్ జనవరి 10

త్వరలో అండమాన్ నికోబార్ దీవులను సందర్శించటానికి కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ కామరాజ్ అంగీకరించారు నేటి ఉదయం అండమాన్ కాంగ్రెస్ వాదులు శ్రీ మనోరంజన్ భక్తా, శ్రీ పి యస్ రాజ్‌భోజ్‌లు కాంగ్రెసు అధ్యక్షుని కలుసుకున్నమీదట ఈ నిర్ణయం వెలువడింది ఈ విషయాన్ని శ్రీ పి యస్. రాజ్‌భోజ్ పత్రికా విలేకరులకు వెల్లడించారు

దిద్దుబాటుకు జంకని శ్రీ నందా

దుర్గాపూర్ జనవరి 9

బహిరంగ సభాస్థలానికి కాంగ్రెస్ అధ్యక్షుని ఊరేగింపునకు ప్రతినిధుల క్యాంపుల్లో అందరూ సన్నద్ధమవుతూన్న సమయంలో హోమ్ మంత్రి శ్రీ నందా కూడా తన కుటీరంలోనుండి బయటికి వచ్చారు. అయితే, ఆయన హడావిడిలో ఆయన బ్యాడ్జిని తల్లక్రిందులుగా కోటుకు తగిలించుకున్నారు అదిచూచి, కేంద్ర ఆహార మంత్రి శ్రీ సి సుబ్రహ్మణ్యం నవ్వుతూ ప్రక్కనే ఉన్న ఒకామెను ఆ బ్యాడ్జిని సరిచేయమని కోరారు

"నేను అభ్యంతరం చెప్పను ఇతరుల లోపాలు కనిపెట్టడమే పనిగాని తాను మాత్రం దిద్దుబాటుకు ఒప్పుకోరు అని నన్నెవరూ విమర్శించకుండా ఉందురు గాక" అని నందా నవ్వుతూ అన్నారు. లోగడ నందాగారి సదాచార కార్యక్రమాలను విమర్శించిన వారిలో శ్రీ సుబ్రహ్మణ్యం ఒకరు.

రాజమండ్రి ప్రెస్‌వర్కర్సు యూనియన్ మహాసభ

రాజమండ్రి జనవరి 8

రాజమండ్రి ప్రెస్ వర్కర్సు యూనియన్ కార్యవర్గ సమావేశం మొన్న జట్ల లేబర్ యూనియన్ కార్యాలయంలో శ్రీ దొడ్డి సింహాద్రిగారి అధ్యక్షతన జరిగింది.

రేడియో

మంగళవారం, జనవరి 12
శక 1886 ★ పుష్య 22

విజయవాడ

357 1 మీ (840 కిలోసై)

ఉదయం: 6-30 శుభోదయం ప్రసారవిశేషాలు తిరుప్పావై ప్రవచనం: 6-40 అం.వా 6-45 భక్తిరంజని – చెయ్యూర్ చెంగల్వరాయ శాస్త్రి కృతులు: 6-55 సూక్తిముక్తావళి: 7-00 తె వా: 7-15 చతురంగం: 7-30 గంగూబాయ్ హంగల్ 8-00 అం వార్తలు: 8-15 ప్రాంజలి: 8 30 వీణ: 9-00 సమాప్తి

మధ్యాహ్నం: 12-30 కార్మికులకు – హై రిలే 1-00 స్త్రీల కార్యక్రమం: 1-30 గానసుధ 1 40 హిం వా: 1-50 తె. వా: 2-00 సమాప్తి

సాయంత్రం: 6-00 స్థానిక ప్రకటనలు: 6 05 ప్రాం వా: 6-15 ప్రస్తుతాంశం: 6-20 గ్రామస్థుల రేడియో గోష్ఠి 7-00 తె వా: 7-15 గ్రామస్థులకు: 7-30 ఫిల్మ్ సంగీతం: 7-45 రేడియో వార్తావాహిని: 8-00 వీణ: 8-30 శ్రోతల ఉత్తరాలకు జవాబులు: 8-45 లలిత సంగీతం: 8-55 ప్రస్తుతాంశం: 9-00 అం వా 9-15 అంగ్లమున: 9-25 విరామ సంగీతం: 9-30 గోదాదేవి – సంగీత నాటిక: 10-30 అం వా: 10-35 సమాప్తి - జన గణ మన

హైదరాబాద్ – ఎ

405 4 మీ (740 కిలోసై)

ఉదయం: 6-30 సుప్రభాతం కార్యక్రమ వివరణ: 6-40 అం వా: 6-45 భక్తిరంజని- వి రిలే 6-55 సూక్తిముక్తావళి 7-00 తె. వా: 7-15 సంకీర్తనం: 7-30 ఆర్ స్వామినాథన్: 7 45 నాదానుభూతి: 8-00 అం. వా: 8-15 విజయవాడవలె 8-30 విజయవాడవలె: 9-00 ప్రసార సమాప్తి

మధ్యాహ్నం: 12-30 కార్మికులకు – భోగి సంక్రాంతి కనుము – సంభాషణ: 1-00 వి. రిలే: 1-30 వాద్యగోష్ఠి – నిలయ విద్వాంసులు: 1-40 హిం వా: 1-50 తె. వా 2-00 సుగమ సంగీత్ 2-10 ఉ వా: 2-20 సితార్ 2 30 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 6-00 స్థానిక ప్రకటనలు 6 05 ప్రాం. వా. 6-15 ప్రస్తుతాంశము: 6-20 హై బి వలె: 7-00 తె. వా: 7-15 హై బి వలె: 7-45 రేడియో వార్తా వాహిని: 8-00 మీరు కోరిన పాటలు: 8-30 హిందీ ప్రసంగం: 8-45 ఈ మాసపు పాట: 8-50 విరామ సంగీతం: 8-55 ప్రస్తుతాంశం: 9-0 అం. వా: 9-15 ఉ వా: 9-30 రాగం, తానం, పల్లవి 10 00 జయాల్: 10-30 అం. వార్తలు: 10-35 ప్రసార సమాప్తి - జన గణ మన

హైదరాబాద్ – బి

కడప

265 1 మీ (1130 కిలోసై)

విశాఖపట్నం

322 6 మీ (930 కిలోసై)

సాయంత్రం 6-00 నుండి రాత్రి 9-30 వరకు

39 42 మీ (3355 కిలోసై)
(హైదరాబాద్ మాత్రమే)

ఉదయం: 6 30 హై ఏ.వలె: 7-45 సమాప్తి

60 12 మీ (4990 కిలోసై.)

8-00 హై ఏ. వలె: 9-00 సమాప్తి

42 02 మీ (7140 కిలోసై)
(హైదరాబాద్ మాత్రమే)

మధ్యాహ్నం: 12-30 హై ఏ. వలె 2-10 ఆర్ స్వామినాధన్: 2-30 సమాప్తి

సాయంత్రం: 6-00 హై ఏ. వలె: 6-2 గ్రామస్థుల రేడియో గోష్ఠి: 7-00 తె వా: 7-15 గ్రామస్థులకు: 7-30 జానపదగేయాలు: 7-45 హై: ఏ. వలె: 8-30 ఆర్ స్వామినాధన్: 9 15 అభిజ్ఞుల అభిప్రాయం - ప్రసంగం: 9-30 గోదాదేవి సంగీత రూపకం 10 30 హై ఎ వలె: 10 35 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి - జన గణ మన

మద్రాస్ – బి

211 3 మీ (1420 కిలోసై)
60 98 మీ (4920 కిలోసై)

ఉదయం: 6-40 అం వా: 6-45 మంగళగానం: 7-00 తె వా: 7-15 సంగీతమంజరి. 7-30 ఇశైవణ్ణం – ఎమ్ బాలమురళీకృష్ణ: 8-00 అం వా: 8-15 ప్రసార సమాప్తి

211 3 మీ (1420 కిలోసై)
41 90 మీ (7160 కిలోసై)

మధ్యాహ్నం: 12-00 కార్మికుల కార్యక్రమం: 12-30 మాధ్యమిక పాఠశాలలకు 1-00 కె ఎస్. హరిహరన్: 1-30 అం వా: 1-40 గీతమంజరి 1-50 తె వా: 2-00 మధురగీతం: 2-10 ఉన్నత పాఠశాలలకు: 2-40 ప్రసార సమాప్తి

సాయంత్రం: 5-30 పాశ్చాత్య సంగీతం 6-00 అం. వా: 6-05 ప్రాంతీయ శెయిదిగళ్ 6-20 వాతావరణ సూచన స్థానిక ప్రకటనలు అంగ్లం: 6-30 కార్యక్రమ వివరణ-తమిళం: 6-35 వైకం సరస్వతి: 7-00 తె. వా: 7-15 క్లారినెట్ – నిలయ విద్వాంసుడు: 7-30 తమిళ నాటిక: 7-45 ఎస్. కల్యాణరామన్: 8-55 ప్రస్తుతాంశం: 9-00 అం. వా 9-15 అంగ్లమున: 9-30 అంగ్ల ప్రసంగం 10-00 సంగీతామృతం: 10-30 అం. వా 10-35 ప్రసార సమాప్తి - జన గణ మన

దుర్గాపూర్ కాంగ్రెసు సందర్భంలో జరుగుతున్న ప్రదర్శనను కాంగ్రెసునాయకులు సందర్శిస్తున్న సందర్భంలో కలకత్తా ముఖ్య మంత్రి శ్రీ పి. సి సేన్ ప్రధాని శాస్త్రికి ఒక పెళ్ళికొడుకు టోపీపెట్టి "పెళ్ళికొడుకు"ను చేశారు.

చైనా-భారత్ సరిహద్దు వివాదంపై 'టైమ్స్'కు జీవరాజ్ మెహతా లేఖ

లండన్ జనవరి 9

లండన్‌లోని భారత్ హై కమిషనర్ శ్రీ జీవరాజ్ యన్ మెహతా 'టైమ్స్' పత్రికకు భారత – చైనాల సరిహద్దు వివాదంపై లేఖ వ్రాస్తూ దురాక్రమణ కావించిన దేశం నిర్దేశించే షరతులపై ఆత్మగౌరవం గల ఏదేశం కూడా రాయబారాలు సాగించదని అన్నారు

ఇంతకుముందు 'టైమ్స్' పత్రికలో ఈ వివాద పరిష్కారానికి కొన్ని సూచనలను చేస్తూ ఒక లేఖ ప్రచురించబడింది ఆ లేఖలో పేర్కొనబడిన సూచనలన్నింటినీ శ్రీ జీవరాజ్ యన్ మెహతా త్రోసిపుచ్చారు

ఐరాసలో చైనాకు సభ్యత్వం కల్పించవలసిన అవసరాన్ని గుర్తించి ఆ దేశానికి ప్రపంచ సంస్థలో స్థానం కల్పించాలనే వాదనను భారతదేశం ఎల్లప్పుడూ బలపరుస్తున్నదని ఆయన తెల్పారు

జగ్గయ్యపేట అసిస్టెంటు మెకానికల్ ఫోర్మన్ శ్రీ చలపతిరావు బదిలీకై డిమాండ్

విజయవాడ జనవరి 10

జగ్గయ్యపేట ఆర్ టి సి 'డిపో'లో అసిస్టెంటు మెకానికల్ ఫోర్మన్‌గా ఉన్న శ్రీ డి. చలపతిరావు కొంతకాలంగా కార్మికులపై అక్రమ చర్యలు సాగించుచున్నందుకూ కార్మికులలో కొంత మందిని కూడగట్టుకొని మిగతా వారిపట్ల ద్వేషపూరిత వివక్షతతో వ్యవహరిస్తున్నారనీ కార్పొరేషన్ ఆస్తులకు ఆదాయాలకు నష్టకరంగా వ్యవహరించు చున్నారని కార్మికులలో వారిపట్ల తీవ్ర అసంతృప్తి ప్రబలిందనీ అందుచేత వారిపై చేయబడిన ఆరోపణలను తక్షణంవిచారించాలని ఆయనను అక్కడనుండి బదిలీచేయాలనియంప్లాయీస్‌యూనియన్‌కార్యదర్శి శ్రీ వై. ఎ.రావు బ్రాంచి కార్యదర్శి శ్రీటి వెంకటేశ్వరరావుగారు డివిజనల్ కంట్రోలర్ (ఇన్ – చార్జి)ను గట్టిగా కోరినట్లు తెలుస్తూంది 10-12-64 న యీ కోర్కెను తెలియపరుస్తూ యూనియన్ లిఖిత పూర్వకంగా కోరినప్పటికి యింతవరకు అధికారులు ఏ చర్యాతీసుకోనందుకు తమ ఆక్షేపణను తెలియజేసినారు

అదే విధంగా బందరు డిపోలో నాలుగున్నర సంవత్సరాలుగా పనిచేస్తున్న దాదాఖాన్‌ను ఏకారణం లేకుండా అకస్మాత్తుగా తొలగించడం కోటేశ్వరరావు అను క్లీనరును సస్పెండు చేయటం యిటువంటి చర్యలవల్ల బందరు డిపోలో కార్మికులు కూడా చాల తీవ్ర ఆందోళన చెందుతున్నారనీ అందుచేత వారిపై తీసుకోబడ్డ చర్యను రద్దుచేసి ఆ యిద్దరు కార్మికులను పనిలోనికి చేర్చుకోవాలని కూడా కోరారు.

డివిజనల్ కంట్రోలర్ ఇన్-చార్జి శ్రీ వై సత్యనారాయణగారు సావధానంగా ఎన్ని అన్ని విషయాలు పరిశీలించగలమని సెలవుమీద నున్న డివిజనల్ కంట్రోలరు తిరిగి రాగానే పై కోర్కెలను గురించి తక్షణచర్యలు తీసుకోగలమని యూనియన్ నాయకులకు హామీ యిచ్చినట్లు తెలుస్తున్నది.

భారత్-అరబ్ రిపబ్లిక్ సంయుక్త శాస్త్రీయ సంస్థసభ్యుల సమావేశం

భారత్ ప్రతినిధివర్గం

న్యూఢిల్లీ జనవరి 9

జనవరి 19 నుండి 24 వరకు కైరోలో జరుగనున్న భారత-ఐక్య అరబ్ రిపబ్లిక్‌ల సంయుక్త శాస్త్రీయ సంస్థ సమావేశానికి హాజరయేందుకు భారతీయ సభ్యులు జనవరి 18న బయలుదేరి వెళ్తారు

ఈ ప్రతినిధి వర్గానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ ఎం సి ఛాగ్లా నాయకత్వం వహిస్తారు శ్రీ ఛాగ్లాతోపాటు శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధకసంస్థ డైరెక్టర్ జనరల్ డా యస్ హుస్సేన్ జహీర్ జాతీయ రసాయనిక ప్రయోగసంస్థ డైరెక్టరు డా కె వెంకట్రామన్ భారతశాస్త్రీయసంస్థ డైరెక్టరు డా యస్ ధవాన్ కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ సహాయ సలహాదారు డా జి కె చందిరామణి ఢిల్లీ విశ్వ విద్యాలయంలోని ప్రొఫెసర్ శేషాద్రి, శాస్త్రీయ పారిశ్రామిక భారతీయ పరిశోధక సమితికార్యదర్శి శ్రీ ఎ. రహమాన్‌లు ఈ సమావేశానికి హాజరౌతారు

భారత్ – ఐక్య అరబ్ రిపబ్లిక్‌ల మధ్య శాస్త్రీయ సాంకేతిక రంగాలలో సన్నిహిత సంబంధాలు సహకారం నెలకొల్పుకోవాలనే ఉద్దేశ్యంతో గత సెప్టెంబరుమాసంలో ఉభయ ప్రభుత్వాలు ఒప్పంద పత్రంపై సంతకాలు చేశాయి ఈ ఒప్పందానికి సక్రమంగా రూపకల్పన కావించేందుకు ఈ సంయుక్త శాస్త్రీయ సంస్థ నెలకొల్పబడింది.

దుర్గాపూర్ కాంగ్రెసు మహాసభలో వైద్య సౌకర్యాలు

దురాపూర్ జనవరి 9

దుర్గాపూర్ కాంగ్రెసు మహాసభ ప్రతినిధులకు వైద్య సౌకర్యాలు సమకూర్చడానికి 10 మంది వైద్యనిపుణులతో సహా మొత్తం 50 మంది డాక్టర్లు పనిచేస్తున్నారు వీరికి 100 మంది వైద్యవిద్యార్థులు సహాయపడుతున్నారు

అత్యంత ఆధునికమైన వైద్య పరికరాలను ఇక్కడ స్థాపించిన వైద్య కేంద్రంలో నెలకొల్పారు.

ఇప్పుడు 30 మంది రోగులు ఈ వైద్య కేంద్రంలో చికిత్స పొందుతున్నారు. ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన శ్రీమతి ఆర్ మనోహరం రక్తపు పోటుతో బాధపడుతూ ఈ కేంద్రంలో ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. ఒక సమయంలో ఆమె పరిస్థితి క్షీణంగా తయారైంది కాంగ్రెసు నాయకులు శ్రీయుతులు కామరాజ్ సంజీవరెడ్డి సంజీవయ్యమున్నగువారు ఆమెను పరామర్శించారు.

అమెరికాకు ఉత్తర కొరియా హెచ్చరిక

వియత్నామ్ రంగానికి దక్షిణ కొరియా సేనల్ని తీసుకువెళ్తే, ప్రజాసేనలకు అండగా తామూ సేనల్ని పంపుతామని స్పష్టీకరణ

మాస్కో జనవరి 10

దక్షిణవియత్నామ్ ప్రజా విముక్తి సేనలపై యుద్ధంలోకి దక్షిణ కొరియా సేనల్ని గనుక దించినట్లయితే అక్కడి ప్రజావిముక్తి సేనలకు సహాయంగా తమ సైనిక దళాలను తప్పకుండా పంపుతాము అని ఉత్తర కొరియా ప్రజారిపబ్లిక్ ప్రభుత్వం, అమెరికాను ఉద్దేశించి నేడొక హెచ్చరిక ప్రకటించిందని మాస్కో రేడియో తెలిపింది

దక్షిణ వియత్నామ్ పోరాటంలో అమెరికా సేనలకూ ప్రభుత్వ సేనలకూ సహాయంగా ఇరవై వేలమంది సైనికులను పంపడానికి దక్షిణ కొరియా ప్రభుత్వం సమాయత్త మవుతున్నదని వెల్లడయింది తాము సాగిస్తున్న పోరాటం స్వేచ్ఛాదేశా లన్నిటి భద్రతకోసం సాగిస్తున్న పోరాటమనీ కాబట్టి అట్లాంటిక్ కూటమిలోని తక్కిన దేశాలూ ఇతర 'మిత్ర' దేశాలూకూడా ఈ యుద్ధంలో ప్రత్యక్షంగా పాల్గొనాలనీ అమెరికా ప్రభుత్వం కొంతకాలంగా రకరకాలుగా ఒత్తిడి తెస్తున్న విషయం అందరికీ తెలిసినదే తన చేతికింద ఉన్న కొమింటాంగుముఠా (తైవాన్ దీవి) బలగాలను అక్కడ ఇదివరకే రంగంలోకి దించింది.

ఇప్పుడు మరొక అమెరికా కీలుబొమ్మ ప్రభుత్వం దక్షిణ కొరియా ప్రభుత్వం ఇరవై వేల సైన్యంతో రంగంలోకి దిగడానికి సమాయత్త మవుతూంది

దీనిని గమనించి ఉత్తర కొరియా ప్రభుత్వం పై విధంగా హెచ్చరిక చేసిందని మాస్కో రేడియో తెలిపింది

చైనాతో ఇండొనీషియా సైనికపొత్తు?

లండన్ పత్రిక ఊహాగానం

లండన్ జనవరి 9

ఇండొనీషియా ప్రజా చైనాతో సైనిక ఒప్పందం చేసుకోవచ్చునని లండన్ 'సండేటైమ్స్'పత్రిక రాసింది

జకార్తానుండి ఆ పత్రిక విలేఖరి పంపిన వార్తను ఆ పత్రిక ప్రచురించింది

చైనా – ఇండొనీషియా ఉభయ దేశాల సంబంధాల గురించి జకార్తాలో ఇండొనీషియా విదేశాంగమంత్రి సుబాండ్రియో చైనా రాయబారి మధ్య సంభాషణలు సాగుతున్నాయని కూడా ఆ పత్రిక రాసింది.

పెనామాలో అమెరికా వ్యతిరేక ప్రదర్శనలు

పెనామా, జనవరి 9

ఈవేళ పెనామాలో విద్యార్థులు పెద్ద పెట్టున అమెరికా వ్యతిరేక ప్రదర్శనలు జరిపారు అమెరికా దురాక్రమణ విధానాలను ఖండిస్తూ బహిరంగసభలు జరిగాయి

1964 జనవరిలో పెనామా కాలువ ప్రాంతంలో అమెరికా సైనికులకూ పెనామా జాతీయ వాదులకూ సంఘర్షణ జరిగిన నాటి వార్షిక దినం నేడు ఈ సందర్భంలోనే ఈ ప్రదర్శనలూ బహిరంగ సభలూ జరిగాయి

కాలువ ప్రాంతాన్ని అమెరికా సైనికులు ఖాళీ చేయాలి , పెనామా కాలువ పెనామా ప్రజల సొత్తు' అనే నినాదాలతో నగరం మారు మ్రోగింది

ఏడాదిక్రితం జరిగిన సంఘర్షణల్లో చనిపోయిన వారి శ్రద్ధాంజలి సూచకంగా నగరంలోనూ కాలువ ప్రాంతంలోనూ పతాకాలను అవనతం చేశారు నిరుటి సంఘర్షణలో చనిపోయిన 21 మంది సమాధులవద్దకు ప్రదర్శకులు ఊరేగింపుగావెళ్ళి శ్రద్ధాంజలి ఘటించారు

అమెరికావారి ఆక్రమణకింద ఉన్న కాలువ ప్రాంతంలోకి చొచ్చుకు వెళ్ళడానికి గతరాత్రి ఈ వేళ ఉదయమూ ప్రదర్శకులు మొత్తం మూడుసార్లు ప్రయత్నించారు కాని పెనామా ప్రభుత్వ పోలీసు దళాలు వారిని నివారించాయి ఒక సందర్భంలో పోలీసులు బాష్పవాయు ప్రయోగానికి కూడా పూనుకున్నారు.

ఫ్రాన్స్ - తూర్పు జర్మనీలమధ్య వర్తకాభివృద్ధి

తూర్పు బెర్లిన్ జనవరి 9

ఫ్రాన్స్ తూర్పుజర్మనీలమధ్య 1965 వ సంవత్సరానికి నిన్న ఒక వర్తక ఒడంబడిక కుదిరింది. దీనిప్రకారం ఉభయదేశాలమధ్య వర్తకం ఎనభై శాతానికిపైగా పెరుగుతుంది. తూర్పుజర్మనీ ఫ్రాన్స్‌కు ప్రధానంగా యంత్రాలను బట్టలనూ ఆఫీసు యంత్రాలనూ ఎగుమతి చేస్తుంది.

ఈనెల 13 వ తేదీని ప్రధాని శాస్త్రి అస్వస్థురాలుగానున్న తన సోదరిని చూడ్డానికి పాట్నా వెళుతున్నారు.

ఆర్థిక తీర్మానంపై తీవ్ర విమర్శలు

కాంగ్రెసు విషయనిర్ణయ సభలో చర్చ వివరాలు

దురాపూర్ జనవరి 9

నాలవ ప్రణాళిక కాలంలో వ్యవసాయాభివృద్ధికి గ్రామీణరంగంలోపునరుజ్జీవన సాధనను ఉద్దేశించిన నూతన ఆర్థిక విధాన ప్రకటనను 69 వ కాంగ్రెసు మహాసభ విషయ నిర్ణయ సంఘం నేడు ఆమోదించింది

గత మూడు రోజులుగా జరుగుతున్న విషయ నిర్ణయసభ నేటితో ముగిసింది

నూతన ఆర్థిక విధానాన్ని నిర్దేశిస్తున్న సుదీర్ఘమైన తీర్మానానికి ప్రతిపాదించిన 72 సవరణలను ఉపసంహరించుకొన్నారు ఈ తీర్మానంపై 10 గంటలపాటు చర్చ జరిగింది.

ఈ తీర్మానంపై కాంగ్రెసు ప్రతినిధులు చేసిన తీవ్రమైన విమర్శలుచూస్తే కాంగ్రెసు చరిత్రలోనే ఇలాంటి విమర్శలు యింతకు ముందెన్నడూ జరగలేదని చెప్పవచ్చు.

ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి తీర్మానంపై వచ్చిన విమర్శలకు సమాధానమిస్తూ వచ్చే మార్చినాటికి ఆహారవిధానం నిర్దిష్టరూపం ధరించవచ్చునని పేర్కొన్నారు.

గుత్తాధిపత్యవర్గాలు

ఈతీర్మానంపై అతివాద కాంగ్రెసువాదులు చేసిన విమర్శనలకు, తీర్మాన ప్రతిపాదకులు శ్రీ జగ్‌జీవన్‌రామ్ సమాధానమిస్తూ గుత్తాధిపత్య సంస్థలను యధేచ్ఛగా వదులుతున్నట్టు చెప్పడం నిజం కాదన్నారు గుత్తాధిపత్యం ఏరూపంలోవున్నా నివారించాలని ఈతీర్మానం స్పష్టంగా నిర్దేశిస్తూన్నట్టుఆయన పేర్కొన్నారు

అంతకుముందు జరిగిన చర్చలో గుజరాత్ కాంగ్రెసు నాయకుడు లోగడ కామరాజ్ పథకాన్ని తీవ్రంగా ఖండించినవ్యక్తి అయిన శ్రీ త్రికందాస్ పటేల్ మాట్లాడుతూ ఆహార సంక్షోభానికి సంపద కేంద్రీకరణకు, దొంగ సొమ్ము, కాంగ్రెసులో ముఠాలు పెరగడానికి కాంగ్రెసు నాయకత్వమే పూర్తిగా బాధ్యత వహించాలని ఈ అవలక్షణాలన్నీ ప్లానింగ్ వల్లనే వచ్చిపడ్డాయని, ప్లానింగ్‌లో ప్రధాన బాధ్యత వహించిన హోంమంత్రి శ్రీ నందా వీటికి ఎక్కువగా బాధ్యులనీ ఆరోపించారు.

శ్రీ పటేల్ వంటివారి ప్రసంగం వింటుంటే అసలు తాము కాంగ్రెసు వాదులుగా వారు భావించుకొంటున్నారా అని ప్రశ్నించవలసి వస్తుందని ప్రధాని శ్రీ శాస్త్రి తన సమాధానంలో హెచ్చరించారు

కాంగ్రెసు విషయ నిర్ణయసభ ఆమోదించిన ఆర్థిక తీర్మానంలోని ప్రధానాంశాలు ఇవి:

(1) గ్రామీణ పరిశ్రమలను ప్రధానంగా సహకార రంగంలో పెంపొందించాలి, (2) ఆర్థిక స్తోమత అంతగా లేని రైతులకు పెద్ద ఎత్తున పరపతి సౌకర్యాలు కల్పించాలి, (3) భారీ పరిశ్రమలను వాడకం వస్తువుల పరిశ్రమలను తగినంతగా పెంపొందించాలి (4) సాంకేతికాభివృద్ధిని సాధించాలి (5) అవినీతిని నిర్మూలించాలి (6) దొంగ సొమ్మును బయటకు లాగాలి (7) పరిపాలనా యంత్రాంగాన్ని సంస్కరించాలి

సభ్యుల సూచనలు

ఆర్థిక తీర్మానంపై జరిగిన చర్చలో పాల్గొంటూ శ్రీ బి ఎస్ తివారీ (బీహార్) 2 ఎకరాలు అంతకులోపు భూమిగల రైతుల నుంచి శిస్తువసూలు చేయరాదని కోరారు పారిశ్రామిక కార్మికులకు కల్పిస్తున్న సౌకర్యాలనే వ్యవసాయ కార్మికులకు కూడా ప్రభుత్వం కల్పించాలని ఆయన సూచించారు

శ్రీ సిన్హాసేన్ సింగ్ (యు పి) మాట్లాడుతూ ఇప్పుడు దేశంలో ఏర్పడిన చిక్కులు ప్లానింగ్‌వల్ల ఉత్పన్నంకాలేదని ప్లానులను అమలు జరిపిన పద్ధతివల్ల దాపురించినవని స్పష్టం చేశారు

శ్రీ దరోగా ప్రసాద్ రాయ్ (బీహార్) మాట్లాడుతూ ధరలను కనుక ప్రభుత్వం అదుపులో పెట్టకలేకపోతే మొత్తం ప్లానింగ్‌అంతా కుప్పకూలిపోతుందని హెచ్చరించారు

దొంగ వ్యాపారులకు వచ్చిన దమ్ములు

పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మరణానంతరం లాభార్జన పరులకు దొంగ వ్యాపారులకు ఎక్కడలేని దమ్ములు వచ్చాయని వారు తమ యిష్టానుసారం ధరలను పెంచివేస్తున్నారని శ్రీ దరోగా ప్రసాద్‌రాయ్ పేర్కొన్నారు

బ్రజవిల్లి కాంగో-చైనా స్నేహ సంధి

బ్రజవిల్లి జనవరి 9

చైనా ప్రజా రిపబ్లిక్ కాంగో (బ్రజవిల్లి) ప్రభుత్వాలు ఉభయ దేశాలమధ్య కుదిరిన స్నేహ ఒడంబడికను నేడు ధ్రువ పరిచాయి.

40ఏండ్లసాగుభూమి నుండి సాగుదారుని తొలగింపు

నర్సీపట్నం జనవరి 9

నర్సీపట్నంతాలూకా హుకుంపేట గ్రామంలో పాండవుల గెడ్డ అనే సుమారు 3½ ఎకరముల పోరంబోకును ముసర సోములు అనే ఆసామీ – హరిజనుడూ, అరువది ఏళ్ళ వృద్ధుడూ దాదాపు 40 సంవత్సరములబట్టి సాగుచేసుకుంటూ రెవెన్యూవారి వుత్తర్వులపై పెనాల్టీలు చెల్లిస్తున్నాడు మొదట్లో పన్నెండణాల పెనాల్టీలనుండి రూ 75/– ల వరకు దానిని పెంచారు

దర్మిలా 1962లో ల్యాండు ఎంక్రోచ్‌మెంటు చట్టంప్రకారంతొలగించారు 40సంవత్సరముల పైగా అనుభవిస్తున్న ఏకైక జీవనాధారంగా ఏర్పర్చుకొన్న పోరంబోకును మళ్ళీ ఆక్రమించుకొన్న ముసర సోములు అదే భూమిని తనకు లీజుకుఇప్పించవల్సిందని తహశీల్దారుకు అర్జీదాఖలు చేసుకున్నాడు పాండవుల గెడ్డ క్రింద ఆయకట్టున్నది కాగా లీజుకు యివ్వబడదు అని తహశీలారు జవాబిచ్చారు ఇది వయోవృద్ధుడైన ముసర సోములుకు జీవన్మరణ సమస్యగా పరిణమించింది

ఆంధ్ర నాటక కళా పరిషన్మహాసభలు వాయిదా

తాడేపల్లిగూడెం జనవరి 9

ఆంధ్ర నాటక కళాపరిషత్తు కార్యవర్గ సమావేశం జనవరి 2 వ తేదీన తాడేపల్లిగూడెంలో పరిషదధ్యక్షులు సాంస్కృతికశాఖా మంత్రి అయిన శ్రీ ఎం ఆర్ అప్పారావు గారి అధ్యక్షతను జరిగినది శ్రీయుతులు కాజ వెంకట్రామయ్య త్రిపురనేని శివప్రసాదరావు వనల సూర్యచంద్రరావు యర్రోజు మాధవాచార్యులు పోలవరపు సూర్యప్రకాశరావు వల్లభనేని వెంకటరత్న ప్రసాద్ సుంకర కనకారావు గారు హాజరైనారు

సుప్రసిద్ధ కళాకారులు శ్రీ ద్వారం వెంకటస్వామినాయుడు శ్రీమతి పసుపులేటి కన్నాంబ శ్రీ చిలకలపూడి వెంకటేశ్వరశర్మ, శ్రీ గోపిశెట్టి హనుమంతరావు శ్రీ పెళ్ళూరి శేషగిరిరావు శ్రీ అంకరాజు శంకరరావు శ్రీ సంపగి పాపారావుగారల మృతికి సంతాపము ప్రకటింప బడినది.

24 వ వార్షిక మహాసభలనుగూర్చి దీర్ఘమయిన చర్చ జరిగిన తర్వాత గత ఇరువదేండ్లనుండి పరిషత్తు మహాసభలతోపాటు జరుగుచున్న నాటికా నాటక ప్రదర్శనముల విధానము పునర్వ్యవస్థీకరించుట అవసరమని భావించుచు రాబోవు కార్యవర్గ సమావేశము వరకు పరిషత్సభల విషయము వాయిదావేయుటకు తీర్మానించారు

ఇది 'సోషలిజం కాదు'; 'శోషలిజం'

తమ జీవితం మరింత దుర్భరంకాగా రాజమండ్రి పేపర్ మిల్లు కార్మికులు పొందిన అనుభవం

రాజమండ్రి, జనవరి 8

రాజమండ్రిలోని ఆంధ్ర పేపర్‌మిల్లు ప్రభుత్వరంగంనుండి ప్రయివేటు రంగానికి మారినతర్వాత, వారి పరిస్థితులు మరింత గడ్డుగా మారి జీవితావసర వస్తువుల ధరలు పెరిగిపోయి, ప్రభుత్వం చెప్పే 'సోషలిజం' వారికి శోషలిజంగా అనుభవ మౌతున్నది

రాజమండ్రిలోని ఆంధ్ర పేపర్ మిల్సు ప్రభుత్వ యాజమాన్యం నుండి ప్రైవేటు రంగంలోకి మారి ఆంధ్రప్రదేశ్ పేపరు మిల్సు లిమిటెడ్''గా అవతారమెత్తి సుమారు ఆరుమాసాలు కావస్తోంది నూతన యాజమాన్యం 'హడావిడి చూసి మిల్లు కార్మికులు కొత్త యాజమాన్యంతోపాటు కొత్త రోజులువచ్చాయని తమ దుస్థితి బాగుపడుతుందని ఎంతో సంబరపడ్డారు తాము సర్వవిధాలా నూతన యాజమాన్యానికి సహకరించి మిల్లు పురోభివృద్ధికి కృషిచేస్తామని ఆంధ్రపేపర్ మిల్లువర్కర్స్ యూనియన్ తరఫున యూనియన్ ప్రతినిధులు హామి కూడా ఇచ్చారు

వరదనుండి సుడిగుండానికి

కాని కార్మికులు తాము అంతవరకు ప్రయాణం చేస్తున్న వరద ప్రవాహంలోనుండి పెదసుడిగుండంలో వచ్చిపడ్డామని నూతన యాజమాన్యం క్రింద అర్థంచేసుకోడానికి పట్టుమని నెలరోజులు కూడా పట్టలేదు కొత్త మేనేజిమెంటు ప్రభుత్వంనుండి మిల్లు వశపరచుకొన్న నాటి ఒప్పందానికి విరుద్ధంగానూ ప్రభుత్వ జి ఓ కు వ్యతిరేకంగాను ఎట్టి కారణమూ చూపకుండా 9 మంది కాంటీన్ వర్కర్లను హఠాత్తుగా ఒకరోజు నోటీసు ఇచ్చి పనినుండి తొలగించింది కొత్త మేనేజిమెంటుయొక్క ఈ చర్య కార్మికులందరినీ భయాందోళనలో యుంచింది. పై తొమ్మండుగురి విషయం లేబరు ఆఫీసరుకు ప్రభుత్వానికి తెలియచేశారు

మిల్లు మేనేజిమెంటు మూడునెలల అనంతరం తిరిగి మిల్లు తిరిగినపుడు పని ఇస్తామని లేబరు ఆఫీసరువద్ద చెప్పి రెండు నెలలు గడిచినా మిల్లు తిరగడం ప్రారంభించి సుమారు నెలరోజులైనా ఆ తొమ్మండుగురికి పని ఇవ్వలేదని తెలుస్తోంది.

పేపరుమిల్లు ప్రభుత్వ యాజమాన్యంలో వున్నప్పుడు 1956 లో ప్రభుత్వం నియమించిన హనుమంతరావు కమిటీ సూచనలను కొద్ది మార్పులతో 1958 సం॥ ఆగష్టు నెల నుండి 26+24=50 రూపాయల కనీస వేతనం కార్మికులకు అమలు జరిగింది- ఈకనీస వేతనం అమలు జరిపే నాటికి కనీస జీతం రు. 30/ మాత్రమే.

రు 48 లతో నరకప్రాయమైన కార్మికుని బ్రతుకు

1958 నుండి ఆరు సంవత్సరాలలోనూ బజారులో నిత్య జీవితావసర వస్తువుల ఆకాశాన్నంటి ప్రమాణంలో అష్టకష్టాలను అనుభవిస్తూ నెలసరి ఆదాయం కనీసం 200/- రూపాయలుంటే కాని గడువని గడ్డు రోజులు వచ్చినాపేపరుమిల్లుకార్మికుని జీతంలో ఏమాత్రం పెరుగుదల రాలేదు ఈనాడు పేపరు మిల్లు కార్మికుడు ఆర్థికంగా కృంగిపోయి మానసికంగా యాతనపడుతూ దిక్కు తెలియని స్థితిలో వున్నాడంటే ఆశ్చర్యంలేదు క్రమంగా తలకుమించిన అప్పులభారానికిలోనై పోతున్నారు పూర్తి ఇంక్రిమెంటును పొంది నెలకి రూ 54/ తెచ్చుకొంటున్న కార్మికునకు తన ఆదాయంలో నెలకి రూ 4-25 ప్రావిడెంటు ఫండుక్రింద, రూ 1-25 లు ఇ ఎస్ ఐ ఆసుపత్రుల క్రింద తీసివేయగా చేతికి వచ్చేది రు 48-50 దీనిలో కాంటీనులో నెలకి రు. 3/- లు పోతాయి మిగిలిన రు 45-50 తో కనీసం భార్య: ఇద్దరుముగురు పిల్లలు. తల్లిదండ్రులు కల కార్మికుడు బియ్యానికి ఇంటి అద్దెకి రోజువారి ఖర్చులు, బిడ్డలకు విద్యా బట్టలు చావు-పెళ్ళిళ్ళకు ఏమి ఖర్చుపెట్టి జీవిస్తాడో పరమాత్ముని కే ఎరుక

ఈ దుస్థితిలో వందలాది కార్మికులు తమ రక్త మాంసాలను మిల్లుకు ధారబోసి చావలేక బ్రతకలేక, వందలాది రూపాయలు అప్పులపాలై ఏకదుఃఖంతో జీవిస్తున్నారంటే ఈషణ్మాత్రం అతిశయోక్తి లేదు ఈ దుస్థితిని ప్రభుత్వానికి యూనియన్ తరఫున పదే మొర పెట్టినా ఫలితం కలుగలేదు చివరికి మిల్లును ప్రయివేటు మేనేజిమెంటుకు దఖలు పరచి ప్రభుత్వం తన చేతులు కడుక్కుంది.

ఇటీవల ప్రైవేటు మేనేజిమెంటువారు మిల్లు సూపర్ వైజర్లకు, సూపరింటెండెంట్లకు నెలకి రూ 25/- నుండి రూ 45/- వరకునూ కార్మికులలో కొంతమందికి రూ 5/- నుండి 25/- వరకునూ జీతాలు పెంచడానికి నిర్ణయించి కార్మికుల నోటిలో మన్నుకొట్టి సూపర్ వైజర్లకు సూపరింటెండెంట్లకూ పెంచి జీతాలు అమలుజరిపి వూరుకుంది. పై అధికార్లకైనా పెంచిన జీతాలు అమలుజరిపినందుకు మేనేజిమెంటు అభివందనీయమే

'ఇది సోషలిజం కాదు' 'శోషలిజం'

ఇటీవల మునిసిపాలిటీలలో ఆరోగ్యశాఖ పనివారల జీతం నెలకి కరువు భత్యంతో రు 54/- ల నుండి రూ 66/- లకు పెరిగింది ఒక సాంకేతిక సంస్థలో పనిచేసే కార్మికునికి స్కావెంజరు జీతంకూడా లేదంటే ఈ ప్రభుత్వం ప్రతిరోజూ స్థాపిస్తానని ప్రకటిస్తున్న సోషలిజానికి బదులు శోషలిజం" మాత్రమే క్రమంగా వారికి కనిపిస్తోంది.

రాజమండ్రి పేపరు మిల్లు కార్మికులకు పేపరు తీయడంలో గల నిపుణత్వం ప్రవేటు మేనేజిమెంటులో రెండువందల రూపాయలు సంపాదించేవారికి కూడా లేదు ఆ విషయం కూడా ఇటీవలనే బుజువైంది అలాగే మెకానికల్ శాఖలో ఫిట్టర్లుకూడా పైనుండి వచ్చిన వారికంటె ఉత్తమ ప్రజ్ఞను చూపారు. ఇక్కడి కార్మికుల నైపుణ్యాన్ని ప్రత్యక్షంగా చూచిన జనరల్ మేనేజరు శ్రీ కృష్ణస్వామిగారు వెస్టుకోస్టుపేపరుమిల్లు స్కేళ్ళను అమలు జరుపుతామనికూడా చెప్పారు

ఈ మిల్లులో ఇంకా వాటాలు కలిగివున్న ప్రభుత్వం వెంటనే కదిలి ప్రయివేటు మేనేజిమెంటుచే వెంటనే కార్మికుల స్థితిగతులు బాగుపరచడానికి వాగ్దానాలు జరిగిన మేరకు జీతాలు పెరగడానికి కృషి చేయకపోతే ఏ కార్మికుడు ఏక్షణంలో ఆకలికి 'హరీ' అంటాడో అనూహ్యం. (వి. వి.)

దుర్గాపూర్‌లో 69 వ కాంగ్రెసు మహాసభ

మొదటిరోజు చర్చలు

దుర్గాపూర్ జనవరి 9

నేడు దురాపూర్‌లో 69 వ కాంగ్రెసు మహాసభ ఆరంభమయింది

కాంగ్రెసు అధ్యక్షుడు టాపులేని కారులో కాంగ్రెసు మహాసభా ప్రదేశానికి వచ్చారు జయజయ ధ్వనులమధ్య 21 అడుగులు ఎత్తున కటిన వేదికపైకి శ్రీ శాస్త్రి ప్రభృతులతో అధిరోహించారు

తెలుపు – నీలిరంగు తెరలతో కట్టిన వేదిక ముందు భాగాన మహాత్మాగాంధీ పండిత నెహ్రూల పెద్ద పెద్ద చిత్రాలు అలంకరించ బడ్డాయి భారత దేశంలో పారిశ్రామికంగానూ వ్యవసాయకంగానూ వచ్చిన అభివృద్ధిని చిత్రించే పటాలు వేలగట్ట బడ్డాయి

సభా స్థలం నలుమూలలా కాంగ్రెసు జెండాలు రెపరెపలాడు తున్నాయి కాని లక్ష మంది కూర్చోడానికి నిర్మించిన ఆవరణలో లక్షమంది ప్రజలు కూడా లేరు విశాలావరణ మంతా బోసిగా కనిపిస్తుంది

దురాపూర్ హౌరా రైల్వేలైన్ వెంబడినే దుర్గాపూర్ ఉక్కుకర్మాగార విస్తరణకు కేటాయించిన విశాల ప్రదేశంలో మహాసభఏర్పాట్లు చేయబడినాయి

కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ కామరాజ్, ప్రధానమంత్రి శ్రీ శాస్త్రి మహాసభ స్థలంవద్ద కారుదిగగానే కాంగ్రెసు సేవాదళం వలంటీర్లు గార్డు ఆఫ్ ఆనర్" ఇచ్చారు పశ్చిమ బెంగాల్ కాంగ్రెసు కమిటీసభ్యులు వారిని వేదిక మీదికి తోడుకొని వెళ్ళారు

ఆహ్వాన సంఘాధ్యక్షుడు శ్రీ పి కె ముఖర్జీ బెంగాలీలో అధ్యక్షునికి ఆహ్వానం ఇచ్చారు అధ్యక్షుడు శ్రీకామరాజ్ తమిళంలో తమ వుపన్యాసం ఇచ్చారు కాంగ్రెసు (అధ్యక్షోపన్యాసం నిన్ననే విశాలాంధ్ర లో ఇచ్చాము)అధ్యక్షుని వుపన్యాసానికి బెంగాలీ అనువాదాన్ని రాష్ట్ర ముఖ్య మంత్రి శ్రీ పి. సి సేన్ చదివారు శ్రీ సేన్ పఠనం పూర్తిఅవుతుండగానే ప్రేక్షకులలో ఒకభాగం ప్రతినిధుల స్థానాలవరకుతోసుకువచ్చారు సేవాదళం వలంటీర్లు వారిని వెంటనే సర్దుబాటు చేశారు.

కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి శ్రీ టి మన్నియిన్ పండిత నెహ్రూ మృతికి సంతాపం తెలుపుతూ తీర్మానం ప్రతిపాదించారు.

మద్రాసు, సింహళాలలో వచ్చిన తుఫానుల వలన నష్టపడిన ప్రజలకు సానుభూతితెలుపుతూ ఒక తీర్మానం, జవహర్లాల్ నెహ్రూ స్మారక నిధికి దండిగా విరాళాల నివ్వాలంటూ కోరుతున్న వేరొక తీర్మానమూ సభలో ఆమోదించబడినాయి

కాంగ్రెసు వాదుల కర్తవ్యం

" కాంగ్రెసు వాదుల కర్తవ్యాలు" అను పేరున మహారాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ వినాయకరావుపాటిల్ ఒకతీర్మానాన్ని ప్రతిపాదించారు

ఆయన ఇల్లా అన్నారు:

"ఈ తీర్మానం కాంగ్రెసు వాదులమీద గురుతర బాధ్యతలను మోపుతూంది ఈనాటి దేశ పునర్నిర్మాణదశలో కాంగ్రెసు వాదులంతా ప్రజలతో సన్నిహిత సంబంధాలుంచుకొని వారి విశ్వాసాన్ని చూరగొనాలి ఒక నిర్దిష్ట మయిన కార్యక్రమంఅంటూ వుంటేతప్ప అది సాధ్యంకాదు

స్వాతంత్ర్య సాధనకు పూర్వంనాటి యువకులు కాదు నేడున్నవారు అనాడు జాతీయ స్వాతంత్ర్యకాంక్ష వారి నుద్రేకపరచింది ఈనాటి యువకులకు రాజకీయ స్వాతంత్ర్యం ఒక్కటే సంతృప్తి కలిగించడం లేదు ఆర్థిక సాంఘిక న్యాయం కూడా కావాలని వారి వాంఛ కాంగ్రెసువాదులు యువకులలోవున్న చొరవను నిర్మాణాత్మక పంథాలోకి మళ్ళించాలి.

కేంద్ర ఉక్కుగనులశాఖ ఉప మంత్రి శ్రీ పి సి సేథీ తీర్మానాన్ని బలపరిచారు.

యువకుల్నీ రైతుల్నీ కార్యకర్తల్నీ జాతీయ పునర్నిర్మాణ కార్యక్రమంలో పాల్గొనేటట్లు కాంగ్రెసు వాదులు ప్రోత్సహించాలి ఈ సందేశాన్ని వారు గ్రామ గ్రామాలకు అందచేయాలి, ప్రజలకు బోధించాలి పరిశ్రమలలోనూ, వ్యవసాయంలోనూ ఉత్పత్తి పెంపొందింపచెయ్యాలి

"దేశంలో ధరలిన్నిరెట్లు హెచ్చుతున్న ఈనాటి స్థితిలోకూడ రైతు పరిస్థితి యెప్పటి లాగనే వుంది కాంగ్రెసు వాదులు వారివద్దకు వెళ్ళాలి వారి కష్టాలేమిటో తెలుసుకోవాలి ప్రభుత్వోద్యోగుల తోడి సహకారంతో వారి పరిస్థితిని మెరుగుపరచడానికి పూనుకోవాలి

సరిహద్దులలో మన జవాన్లకు ఆయుధాలూ అవీ దండిగా కావలసివున్న సమయంలో ఫ్యాక్టరీలలో సమ్మెలు జరగడం అనుచితమని మంత్రి అన్నారు.

సంస్థయొక్క ప్రతిష్ఠకు భంగకరం అయ్యే విధంగా కాంగ్రెసు కార్యకర్తలు వ్యవహరించరాదని శ్రీ బ్రిజభూషణ్‌మిశ్రా (ఉ ప్ర) అన్నారు

కాంగ్రెసు సందేశం దేశంలో పలుతావుల ప్రజలను పుత్సాహ పరచడం లేదో పరిశీలించవలసిన సమయం వచ్చిందంటూ శ్రీ జగత్‌పాల్ సింగ్ (మ. ప్ర) ఒక సవరణను ప్రవేశ పెట్టారు.

కాంగ్రెసు నాయకులూ మంత్రులూ నిజాయితీగా ప్రవర్తించాలని శ్రీ మహామాయా ప్రసాద్ సిన్హా (బీహార్) అన్నారు.

తీర్మానం ఇంతకన్న విస్పష్టంగా వుండాలని శ్రీ ద్వారకాప్రసాద్ కటారియా (మ. ప్ర) అన్నారు.

కాంగ్రెసు కార్యకర్తలు తాము కార్మికులలో పనిచేయడం గాక జాతీయ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసును బలపరచాలని శ్రీ భగ్వత్ ఝాప్ (బొంబాయి) అన్నారు

యువజనులకొక ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించాలని శ్రీ ఎం నాగచౌదరి (ప బెంగాల్) అన్నారు.

ధరల పెరుగుదలతో విపరీత కష్టాలకు గురి అవుతున్న స్వల్పాదాయంవారికి తోడ్పడాలనీ, ధరల పెరుగుదల నాపేటందుకు నోట్లు ముద్రించడం మానాలనీ శ్రీ రాణా శివ లఖ్పర్‌సింగ్ (బీహార్) అన్నారు

ఇప్పటికే ఆలస్యం కావడంచేత తీర్మానం మీద చర్చ రేపుదయం 9 గంటలకు వాయిదా వేయబడింది.

చల్లనిగాలి మబ్బులు, భాషా ఇబ్బందులతో అసలే పల్చపల్చగా వున్న మహాసభా ప్రదేశం మరింత పల్చబడి పోయింది. రెండు లక్షల మందికి పైగా వుపయోగపడాలని నిర్మించిన ఆ విశాలమైన పందిళ్ళలో 20 వేల మంది కూడా లేకపోవడం గమనించవలసి వుంది.

పాకిస్తాన్ దేశ భద్రతకు ప్రమాద మేర్పడిందట!

భారత్ దాడికి సిద్ధమైనట్లు అయూబ్ ఆరోపణ

కరాచి జనవరి 10

పాకిస్తాన్ సరిహద్దులో భారతదేశం సైనిక శక్తిని కేంద్రీకరిస్తున్నదని పాకిస్తాన్ దేశ సమైక్యతకు భద్రతకు ప్రమాదం ఏర్పడిందని సైనిక బలాలకు సందేశం పంపిస్తూ పాకిస్తాన్ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ అన్నారు

ఆయన ఇంకా ఇలా అన్నారు:

"గత సంవత్సరంనుండి పరిస్థితి విషమిస్తున్నది. గత కొలదిమాసాల్లో సరిహద్దుల్లో పెద్ద ఎత్తున సైనిక శక్తులు కేంద్రీకరింపబడుతున్నాయి

భారతదేశం సైన్యాలను కేంద్రీకరించటం పాకిస్తానుకు వ్యతిరేకంగానేనని అయితే అవసరమైనప్పుడు భారతదేశంచేసే దాడిని విజయవంతంగా ఎదుర్కొగల సైనికసంపత్తి పాకిస్తాన్‌కు ఉన్నదని అయూబ్ అన్నారు.

భారతదేశంలో నూనె నిధులు

చైనాలోకంటే అధికమని కేంద్రమంత్రి ప్రకటన

న్యూఢిల్లీ, జనవరి 9

పాకిస్తాన్ చైనాలలోకంటే భారతదేశంలోనే నూనెనిధులు అధికంగా గలవని కేంద్ర పెట్రోలియం శాఖామంత్రి ప్రొఫెసర్ హుమాయూన్ కబీర్ నేడిక్కడ పత్రికా విలేకరులతో ముచ్చటిస్తూ పేర్కొన్నారు

నూనె పరిశోధన కృషిలో భారతదేశానికి సోవియట్ యూనియన్ రుమేనియా వంటి సోషలిస్టు దేశాలు అందజేస్తున్న సహాయాన్ని ప్రశంసిస్తూ ప్రపంచంలో నూనె పరిశోధనా కృషి సగటు సాఫల్యం 1 8 కాగా భారతదేశంలో 150 చోట్ల నూనె కోసం బావులు త్రవ్వగా 120 బావులలో నూనె లభించిందని ఆయన పేర్కొన్నారు

భారతదేశం సొంతనూనెశుద్ధి కర్మాగారాన్ని తయారు చేయడానికి మరొక పదేళ్లు పట్టవచ్చునని ఆయన అన్నారు

డీన్ రస్క్‌తో జాన్సన్ భేటీ

జపాన్ ప్రధానితో చర్చలు జరుపనున్న సందర్భంలో

వాషింగ్టన్ జనవరి 9

జపాన్ ప్రధాని ఇసాక్‌సాటోతో చర్చలు జరిపేందుకు సిద్ధంగా వుండేందుకు నేటి సాయంత్రం విదేశాంగమంత్రి డీన్‌రస్క్‌తో రెండు గంటలసేపు అమెరికా అధ్యక్షుడు జాన్సన్ చర్చలు జరిపారు

ముందు అనుకొన్న కార్యక్రమం ప్రకారం జపాన్ ప్రధాని రేపు శాన్‌ఫ్రాన్‌సిస్కోకు వస్తారు. సోమవారం ఆయన వాషింగ్టన్‌కు చేరతారు.

జపాన్ ప్రధానితో తాను జరుపదలచిన చర్చనీయాంశాలను జాన్సన్ పరిశీలిస్తున్నారని అధ్యక్ష కార్యాలయ పత్రికా శాఖాధిపతి జార్జి రీడే అన్నారు అయితే ఏయే సమస్యలపై చర్చలు సాగుతాయో వెల్లడించటానికి ఆయన నిరాకరించారు అయితే ఇటీవల జపాన్ నవ చైనాతో వాణిజ్య సంబంధాలను అభివృద్ధి చేసుకుంటున్న విషయం తప్పకుండా చర్చనీయాంశాలలో వుంటుందని ఆయన అంగీకరించారు.

"భారతదేశం అలీన విధానానికే కట్టుబడి వుండాలి"

శ్రీ ఆర్ కె నెహ్రూ ఉద్ఘాటన

అలహాబాద్ జనవరి 9

భారతదేశం అలీనవిధానానికి ఖచ్చితంగా కట్టుబడి వుండాలని ఈ విధానాన్నించి ఏమాత్రం తొలగినా తీవ్రపరిస్థితులు ఎదుర్కొనవలసి వస్తుందని విదేశాంగ వ్యవహారాల మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీ ఆర్ కె నెహ్రూ నేడిక్కడ అన్నారు

అలహాబాద్ విశ్వవిద్యాలయంలోని 'నెహ్రూ స్మారక సంఘం' ఏర్పాటుచేసిన సభలో 'నెహ్రూ విదేశాంగ విధానం అనే అంశంపై శ్రీ ఆర్ కె నెహ్రూ ప్రసంగించారు

శాంతి అణు విధానంలో మార్పు తీసుకురావటం చాల అభ్యంతరకరమైన విషయమని నిరాయుధీకరణకు జరిగే సంప్రదింపులకు ఇది చాలా ఆటంకంగా పరిణమిస్తుందని ఆయన అన్నారు.

'షెడ్యూలు కులాల వారి సమస్యలను స్వయంగా చూడాలి'

ప్రధానికి మెమోరాండం

దురాపూర్ జనవరి 10

షెడ్యూల్ కులాలవారిసమస్యలను స్వయంగా పరిష్కరించాలని కోరుతూ భారత దళిత సేవక్‌సంఘ అధ్యక్షులు శ్రీ పి యన్ రాజ్‌భోజ్ నేడిక్కడ ప్రధాన మంత్రి శ్రీ శాస్త్రిని కలుసుకొని ఒక మెమోరాండం సమర్పించారు

భూమిలేని పేదలకు భూమి కల్పించే విషయంతో సహా షెడ్యూల్ కులాలవారి సమస్యల పరిష్కారం విషయంలో ప్రధానమంత్రిని స్వయంగా జోక్యం కల్పించుకోవలసినదిగా ఈ మెమోరాండంలో కోరారు

సంపాదకవర్గం: కాట్రగడ్డ రాజగోపాలరావు (అధ్యక్షులు) ఏటుకూరు బలరామమూర్తి, తుమ్మల వెంకటరామయ్య విశాలాంధ్ర విజ్ఞానసమితి తరఫున ఎడిటర్, ప్రింటర్, అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు, స్వతంత్ర ఆంధ్ర ప్రింటర్స్, విజయవాడ-4